ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

మార్చి 08, 2009

59
39287

కథా నిలయం
శ్రీకాకుళం

బంగారు లోకం

హ్యాపీ బర్త్‌డే

(2009 మార్చి 8 నుంచి
2009 మార్చి - 14 వరకు)

జె.సృజన (చిన్నారి)
2సం॥, మార్చి-10
సరిత - వెంకటేష్
ధర్మన్నగూడ -రంగారెడ్డి

కె.అర్చన
6సం॥, మార్చి-8
పద్మ - రవి
అమరచింత - మహబూబ్ నగర్

నీనా
1సం॥, మార్చి-2008
రాధ-జయప్రకాష్
గుంటూరు

టి.భార్గవి
4సం॥, మార్చి-2009
జ్యోతి - సత్యనారాయణ
విద్యానగర్-కరీంనగర్

యస్.నబీబాష
9సం॥, మార్చి-9
ఆయీషా బాను - మస్తల్‌బాష
అగది -కడప

యం.పండరినాథ్
2సం॥, మార్చి-2009
శారదమ్మ - శ్రీనివాసులు
కొల్లాపూర్ - మ॥,నగర్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1. ఎం.ఎహెచ్ భవన్
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

ఎండాకాలమ్!

చలి వీఆర్‌ఎస్ తీసుకుంది. ఎండలు వేసవి కంటే ముందే వేంచేశాయి. తెల్లవారుతుందో లేదో ప్రంచడభానుడు ప్రత్యక్షం. వచ్చాక ఖాళీగా వుండడుకదా! ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఎండాకాలం తడాఖా తెలుస్తోంది. ఇంకా వడగాలుల వరకు రాలేదుగానీ ఉక్కపోత...చెమట...అలసట అనుభవమౌతున్నాయి. ఆకలి మందగించింది. దప్పిక తీరడంలేదు. చల్లచల్లని పానీయాలవైపు మనసు పరుగెడుతోంది. కార్యాలయాలకెళ్లే ఉద్యోగులు, కార్యోన్ముఖులను మొదలుకొని కుక్కిమంచంలో ముక్కుతూ మూల్గుతూ పడుండే ముసలమ్మల వరకు 'ఇదేమి ఎంట్రీరా సూర్యభగవానుడా?!' అని ఒకటే కలవరింతలు పలవరింతలు. ఫ్యాను గాలికన్నా సేదదీరుదామా అంటే కరెంటు కట్టు. పంఖా కదిలితే ఒట్టు. విసనకర్రతో ఎందాక విసురుకుంటాం! తాగడానికి నీళ్లు పట్టుకుందామా అంటే నల్లా సహకరించదు!

అలాగని వేసవిని పూర్తిగా ఈసడించుకోలేం. అది ఊరకే రాదు మరి. ఉగాదులూ, కోకిల కుహూకుహులూ మోసుకొస్తుంది. చిగురాకులు, మామిడిపళ్లు, ఎర్రెర్రని మోదుగుపూలు, మల్లెపూలు, తాటిముంజెలు, పుచ్చకాయలు, తర్బూజలు, ఈతకాయలు తెస్తుంది. ఎండమీది కోపంతో వీటిని కాలదన్నుకునేవారెవరుంటారు చెప్పండి. మండుటెండలో చల్లచల్లగా వాటిని లాగిస్తుంటే...ఇప్పటివరకు మనం చెప్పకున్న ఉక్క...అలసట...చికాకు అన్నీ తుర్రుమనవూ!

ఓపక్క కాళ్లు చురుక్కుమంటున్నా నచ్చిన వడియాలు పెట్టాల్సిందే. చవులూరించే ఊరగాయలు పట్టాల్సిందే. ఇప్పుడంటే అపార్టుమెంట్లు వచ్చాయిగానీ రాత్రుళ్లు భోజనం చేశాక మిద్దెమీద పండుకుంటే ఎంత హాయి! వెన్నెల రాత్రుళ్లు గడిపే పల్లెవాసులను తలచుకొనే పట్టణ జీవులకు కన్ను కుట్టకుండా ఎలా వుంటుంది?

ఏడాదంతా కాయకష్టం చేసిన రైతుకు కాస్త సేద తీర్చుకునే వీలు కల్పించేది వేసవే. ఊళ్లో పొలంపనులు దొరక్క వ్యవసాయ కూలీలు సోడాలో, కూల్‌డ్రింకులో, చెరుకురసమో అమ్మడానికి బస్తీలకొచ్చే తరుణం ఇదే. సంవత్సరం పొడవునా పాఠాలతో వేడెక్కిన చిన్నారుల మెదళ్లను చల్లబరిచేది వేసవే. వెర్రెక్కిన పోటీ ప్రపంచంలో పిల్లలకు ఆమాత్రం సుఖమెక్కడ. వేసవి మంటలతోపాటు క్రష్షులు, క్రాఫ్ట్ కోర్సులు. అమ్మమ్మ చెప్పే కథలు, తాతయ్య నేర్పే ఈత పాఠాలు, అత్తయ్య వేసే పూలజడలు, వండిపెట్టే పిండివంటల రుచి చూసే అవకాశం కల్పించాల్సింది మాత్రం పెద్దలే. నాలుగు గోడలమధ్య సతమతమయ్యే ఇల్లాళ్ల మనసు కూడా ప్రయాణాలవైపు మొగ్గు చూపేది ఒక్క వేసవిలోనే! అయితే దొంగలకూ వేసవే మాంచి సీజన్ మరి!

ఈ ఈతిబాధలన్నీ పేదోడికే. డబ్బునోడికేం... హాయిగా ఏసీగదులు, ఫ్రిజ్జులూ.. ఎన్నికల పుణ్యమా అని కొందరు సంపన్నులకూ ఈ వేసవి సింహస్వప్నం. ఇంటినిండా డబ్బు మూలుగుతున్నా... నాయకులు మండుటెండలో సైతం రోడ్డున పడాల్సిందే. వీధి వీధి తిరగాల్సిందే. సామాన్యుడి కాళ్లమీద పడాల్సిందే. ఓటు యాచించాల్సిందే. తెలివిగా ఓటు వేయాల్సింది మాత్రం సామాన్యుడే.

సూర్యభగవాన్‌జీ జై! ఓటరుమహాశయా జై!! ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
తెలుసుకుందామా	...	6
కథ	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
మంచి పుస్తకం	...	19
విజ్ఞాన వీచిక	...	20
క్రైమ్ కథ	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

హ్యాపీ హోలీ ... 4



రుచి ...9

బనానా డ్రింక్



ఆరోగ్యం ... 18

హెపటైటిస్ ఎందుకొస్తుంది?

సినిమా కబుర్లు.. 22

తెలుగు తెరకు ప్రాణం పోసిన నాయికలు



కవర్ స్టోరీ విజ్ఞానదాయకం

ప్రపంచంలో మూడు గొప్ప గ్రంథాలున్నాయి. చార్లెస్ డార్విన్ రచన ఆరిజన్ ఆఫ్ స్పీషిస్. సిగ్మండ్ ఫ్రాయిడ్ రచన మనో విశ్లేషణ. ప్రపంచ శ్రామిక వర్గ బావుటా తత్వవేత్త కారల్ మార్క్స్ రచన శ్రామికవర్గ సిద్ధాంతం దాస్ కాపిటల్. డార్విన్ జాతుల పుట్టుక గురించి రాసి 150 సంవత్సరాలు అయింది. పరిణామవాద సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళవలసిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉంది. అగ్ని తరంగం అనే ఓ మంచి పుస్తకాన్ని పరిచయం చేశారు. వీరేశలింగం గారి ఉద్యమానికి రెండు చక్రాలు. ఒకటి సాహిత్యం, రెండోది సంఘ సంస్కరణ.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

బిస్కెట్ల భవనాలు బహు రమణీయం

డార్విన్ పరిణామ సిద్ధాంతం రాసి 150 సంవత్సరాలైంది. ఎప్పుడో 200 సంవత్సరాల క్రితం పుట్టిన డార్విన్‌ను మనం ఇంకా గుర్తుపెట్టుకున్నామంటే దానికి కారణం ఆయన సృష్టించిన డార్విన్ పరిణామ సిద్ధాంతమే. బిస్కెట్ల భవనాలు కడు రమణీయంగా ఉన్నాయి. వీరేశలింగం గారికి మహిళాలోకం ఎంతో రుణపడి ఉంది.

వాస్తు రామచంద్ర,
రాంజీ నగర్, నెల్లూరు.

కంటతడి పెట్టించిన 'కథ కాని కథ'

ఆదివారం స్నేహ పత్రికలో ఈ వారం ప్రచురించిన కథకాని కథ నుజూద్ వాస్తవ కథనం చదివిన కొద్దీ కంటనీరు తెప్పించింది. బిస్కెట్ల భవనాలు, ఆరోగ్యం పేజీలో అనుమానం స్టోరీ, కోటప్పకొండ చరిత్ర బాగున్నాయి. మనలో మాట జాగారాల పండుగ సూపర్. మేఘం పేజీ కలరింగ్ మేకప్ బాగుంది. అతి త్వరలో ప్రజాశక్తి పూర్తి రంగుల పత్రికగా రానున్న శుభసందర్భంగా మా శుభాకాంక్షలు.

పి. ఆర్. శ్రీదేవి, శేఖర్,
మల్లీశ్వరి, తిలకం, సూరి.
సోమల, చిత్తూరు.

అమూల్య సమాచారం

ఫిబ్రవరి 22 నాటి స్నేహలో అట్టమీది కథగా వెంకట్రావుగారు డార్విన్ పరిణామ కథ గురించి అమూల్య మైన సమాచారాన్నందించారు. మేఘం కథ బాగుంది. సినిమా కబుర్లు నచ్చాయి. ముందడుగు అనువాద కథ అయినా చదివింప చేసింది. ఓ మంచి పుస్తకంగా అగ్నితరంగం పరిచయమవడం మహద్భాగ్యంగా భావిస్తున్నాము. బాల నేస్తాలు లో సుడోకు ప్రవేశ పెట్టడం అభినందనీయం. తెల్సా ఫీచర్ మమ్మల్ని విశేషంగా ఆకర్షింపజేస్తోంది. బిస్కెట్ల భవనాల సముదాయం చవులూరింపజేసిందంటే నమ్మండి! చూద్దామా ద్వారా కోటప్పకొండను దర్శించగలిగాము. మనలోమాటగా ఉదహరించిన జాగారాల పండుగ గురించి వాస్తవాలనే తెలవిచ్చారు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

అనురాగ బంధం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం పాఠకులకు అనురాగ బంధంగా మారుతోంది. ప్రతివారం ఎన్నెన్నో అంశాలను తెలియపరుస్తూ అన్ని రంగాల పాఠకుల ప్రశంసలు పొందుతోంది. అదే తరహాలో ఆస్కార్ అవార్డుల బరిలో నిలిచిన మన సినిమా స్లమ్‌డాగ్ మిలియనీర్ గురించి, ఫిబ్రవరి 1 ఆదివారం పుస్తకంలో ఎ.ఆర్. రెహమాన్ గురించి అందించిన సమాచారం చాలా బాగుంది. అదే విధంగా 22 ఫిబ్రవరి ఆదివారం పత్రికలో పింకీ స్మైల్ నవ్వులు పూయించేనా అంటూ వివరాలు అందించిన మీకు అభినందనలు. మీరు పుస్తకంలో రాసిన విధంగానే అవార్డులు కూడా రావడం మా అందరికీ ఆనందంగా ఉంది. ఈ శివరాత్రి పర్వదినాన ఎ.ఆర్. రెహమాన్ ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. మీ పత్రికలు కూడా ఎ.ఆర్. రెహమాన్ గార్కి ఎన్నో రకాలుగా ఆస్కార్ విషయాన్ని బాగా ప్రచారం చేశాయి. ఇంత బాగా మన భారతదేశం యొక్క ఖ్యాతిని ప్రపంచానికి చాటిన రెహమాన్ గురించి ముందుగానే అందరికి తెలియజేసిన మీకు అభినందనలు.

మదీనా.



ఆకట్టుకున్న కవర్ స్టోరీ

ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాదిని డార్విన్ సంవత్సరంగా, పరిణామ సిద్ధాంత సంవత్సరంగా జరుపుకుంటున్న సందర్భంగా డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని గురించిన ఆసక్తికర విషయాలను ఫిబ్రవరి 22 నాటి ఆదివారం అట్టమీది కథ ద్వారా తెలుసుకున్నాం. జీవశాస్త్రం అభివృద్ధి చెందటానికి కారణమైన డార్విన్ పరిశోధనల రహస్యాలను ఈ కవర్ స్టోరీ ద్వారా తెలుసుకోవడానికి వీలయింది. అలాగే 200 సంవత్సరాల చరిత్రగల తీర్థాల శివాలయం గురించీ, గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ గురించిన విశేషాలను చూద్దామా శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. అనుమానం వ్యాధి లక్షణాలను, ముఖ్యమైన విషయాలను ఆరోగ్యం ద్వారా తెలుసుకోవడానికి వీలయింది. ధన్యవాదాలు.

గొల్లమండల సురేష్ కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.

మీ రచనలను, ఉత్తరాలను పంపవలసిన చిరునామా...
ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం
మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాద్.

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

ఈ ఫోటో ఓ ప్రముఖ రాజకీయ నాయకుడిది. ఎవరో తెలియాలంటే 20 వ పేజీ చూడండి.

కవిత్వమ్

చెట్టు

- గవిడి శ్రీనివాస్

కళ్ళలో రేగిన ఆనందాన్ని
వేళ్ళల్లో మొదలు పెట్టి
మొదల్లోంచి ఎగసి
పువ్వులుగా రూపాన్ని అలంకరించుకోవడం
యవ్వనాన్ని తొడుగుతున్నట్టుంది
చూపులు ఊగుతుంటాయి
ఆకులు రేకులు కనుగుడ్లలోంచి
గాలి అలలు అలలుగా తూగుతుంటే
తూనీగలు సంకెళ్ళ తెర దించుకుని
స్వేచ్ఛ రెక్కల్ని ఊపుతున్నట్లుంది
గుండె లోతుల్లోంచి ప్రాణాల్ని లేపే
వాయు కెరటాల్ని వీస్తుంది
కిలకిల గొంతుల్ని నింపేసుకున్న చెట్టు
హరిత కిరణాల్ని వొంపేసుకున్న చెట్టు
గూడైన చెట్టు నీడైన చెట్టు
నిర్మలమైన నవ్వులాంటి చెట్టు
తాకాలే గానీ పచ్చదనం పలకరించిపోదూ
ఒళ్ళంతా పరిమళమే
మేఘాల్ని ముద్దాడితే
మౌనాన్ని వీడి చినుకు చిత్తడి చేయదూ
రాగాల వీణల్ని వీనుల్లో మోగిస్తున్నట్టుంది
నిర్మానుష్యానికి సంకేతంలా
కాలుష్యం కుత్తుకను తెగకోస్తూ
ఆశల్ని చిగురిస్తూ
ఉదయాల్ని పూరించింది

కథా నిలయం
శ్రీకాకుళం

తల్లడిల్లిన తల్లి

- మేకిరి దామోదర్

ముద్దపెట్టి పెంచితినని
ముద్దు పెట్టి మురిపాలు పంచితినని
తాగుబోతు నీ తనువు చూసి
తల్లడిల్లె తల్లి ప్రాణం!

మంచి నీళ్ళను మించి మద్యం తాగుడాయే!
చిత్తైంది నీ బతుకు మత్తులో చిత్ర ఇచిత్రంగా!
ఛీదరించుకుంటాండ్లు చిన్న... పెద్దోలు...!ఛీ..ఛీ... అని
బతుకు దెరువుకై భార్యాపిల్లలపై బాదే లేదాయే!!

బలిసినోడు బారు (పబ్బు)ల్లో మద్యం తాగి దొర్లబట్టె
పేదోడు పెరట్లో సారా తాగి సావబట్టె!
మద్యం (సార) తాగ వద్దంటూ...! సంగతులెన్నో చెప్పిన...
నీ రీతి మారదాయె జిమ్మ చావదాయె
తాగి తాగి నీకు తల్లి తెల్వదాయె! చెల్లి తెల్వదాయె!?

ఒల్లు తెల్వక తాగిన నీ బతుకు వల్లకాడుకు చేరబట్టె
మూడు పదులు దాటక మునుపే ముండ (వివిధ) గాబట్టే! నీ భార్య!!
నిను నమ్ముకున్నోల బతుకు గుది బండ గాబట్టే...
కొనితేబోకు నీవాల్లకు తలకొరవి తంతు!!

నిషేదమంటు నారీమణులు నీతులెన్నో జెపితిరి
నాటు సారాగాచి, మద్యం టెండరేసి నాశనము చేయబట్టిరింకొందరు
మురికి గుంట నీల్లు పటిక బెల్లం పాతరేసి సారజేసి సంపుతాండ్లు...!!!

గాంధీ గారి తోటే మద్య నిషేధం మాట గంగలో కలిసే
నిషేధానికి నాంది నందమూరి రామన్న
రాజశేఖరుడి పాలనకు మద్యమే 'ధన' మాయె
మరి లజ్జ లేదాయె!!!

ఓ బిడ్డలారా!!
పండ్లు కూరగాయలు పసందుగ తినండి
ధ్యాన బతుకుతో ధన్యులు కాండి
దిగాలి మీ మత్తు !
మారాలి ఆ బుద్ధి!!!
సల్లంగుండాలి మీ ప్రాణాలు
సంబరంగ సాగదీయాలే సంసారాలు...

★

హ్యాపీ హోలీ

- కె. చరిత

హోలీ రంగుల పండుగ. ఉత్తర భారతదేశంలో అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ. చేతినిండా రంగులు తీసుకొని హితులు, సన్నిహితులు, స్నేహితులు, బంధువుల మీద ఉత్సాహంగా చల్లుకునే పండుగ. వివాహమైన తొలి సంవత్సరం వచ్చే హోలీ పండుగను ఎంతో వేడుకగా జరుపుకుంటారు. ఈరోజున పెద్దలు కూడా పిల్లలైపోయి గెంతుతూ... తుళ్లుతూ ... పరుగెడుతూ రంగులు చల్లుకుంటారు. పండుగకు కొద్దిరోజుల ముందే మార్కెట్లు రంగులతో నిండిపోయి ఒక రకమైన ఉత్తేజాన్ని నింపుతాయి. చిన్ని చిన్ని జాగ్రత్తలు తీసుకుంటే పండుగను సంతోషంగా జరుపుకోవచ్చు. లేనిపక్షంలో అదో చేదు జ్ఞాపకంగా మిగిలిపోతుంది. తెల్సి తెల్సి ఆ సాహసం ఎందుకు చేయాలి?! అందుకే చిరు జాగ్రత్తలు పాటిద్దాం. ఆనందంగా హోలీ పండుగ జరుపుకుందాం.

హోలీ ఎప్పుడైనా జాగ్రత్తగా ఆడాలి. మన సంతోషమే కాక ఇతరుల సంతోషాన్ని, ఇబ్బందులను కూడా గమనంలో వుంచుకోవాలి. వారికి ఇష్టంలేకుండా, మొండిగా, బలవంతంగా రంగులు పులమడానికి, కుమ్మరించడానికి ప్రయత్నించకూడదు. వారి స్పందనను బట్టి కూడా మనం ప్రవర్తించాల్సి వుంటుంది.

చిరుజాగ్రత్తలు...

★ మార్కెట్లో విరివిగా లభించే రసాయన రంగుల వల్ల కళ్లకు చాలా ప్రమాదం. ప్రతి హోలీ రోజు ఈ ప్రమాదానికి గురై ఎంతో మంది ఆసుపత్రిపాలవడం, చూపు కోల్పోవడం కూడా పత్రికల్లో చూస్తుంటాం. అందుకే కళ్లకు సంబంధించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

★ హోలీరోజున తలకు, ఒంటికి కొబ్బరినూనె పెట్టుకోవడం మర్చిపోకూడదు. చేతివేళ్లకు, కాలి వేళ్లకు గోళ్లరంగు వేసుకుంటే మంచిది. దీనివల్ల వెంట్రుకలకు, పుర్రెకు, గోళ్లకు హోలీ రంగులు పట్టవు.

★ రసాయనాలు కలిసిన రంగులు వాడకూడదు. ముఖ్యంగా గర్భవతులు, జబ్బుపడినవారు... ఈ రంగులకు దూరంగా వుండాలి.

★ పొడవాటి చేతులున్న చొక్కాలే వేసుకోవాలి. వీలైతే సాక్సులు కూడా తొడగాలి.

★ రంగులు కడిగేందుకు గోరువెచ్చని నీటిని ఉపయోగించాలి.

★ తారు, మురికినీళ్లతో హోలీ ఆడకపోవడమే మంచిది.

★ ఒకవేళ మీరు, మీ కుటుంబం హోలీ ఆడదల్చుకోకపోతే...అందుకు తగిన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలి. ఆరోజు ఇంట్లోనే ప్రత్యేకంగా ఏదైనా ఏర్పాటు చేసి అందరూ అందులో పాల్గొంటే ఎటువంటి ఇబ్బందీ వుండదు.

★ అలాగే మీ పిల్లలకు ఇతరులకు ఇష్టం లేకుండా హోలీ చల్లకూడదని కూడా వివరించాలి. ఉదాహరణకు హోలీ చల్లించుకోవడం, చల్లడం ఇష్టంలేని

ఇరుగుపొరుగుమీద మీ పిల్లలు బలవంతంగా చల్లుతుంటే వారించి విషయం వివరించాలి.

★ హోలీ రోజున మైకులు పెట్టి పెద్ద పెద్దగా పాటలు, సంగీతం పెట్టేసి ఇతరులను ఇబ్బంది పెట్టకూడదు. ఇతరుల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలి.

★ వీధుల్లో ఒంటరిగా వెళ్లకపోవడమే మంచిది. వీధుల్లో ఒంటరిగా ఎవరు చిక్కుతారా రంగులు కుమ్మేద్దాం అని ఎదురుచూసే కొందరు కొంటెకోణంగుల చేతుల్లో పడకుండా వుండడం కోసమే ఈ సలహా.

★ బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకెళ్లడం మంచిది. రంగులు, రాళ్లు నింపిన బూరలనుంచి కాపాడుకోడానికే ఈ ఏర్పాటు.

★ ఎప్పుడైనా హోలీ పండుగను సన్నిహితులు, బంధువులు, బాగా తెలిసిన వారి మధ్య జరుపుకోవడమే శ్రేయస్కరం. కొత్తవారికి దూరంగా వుండడం ఉత్తమం.

★ రంగుల పొడిని, నీళ్లను మాత్రమే ఉపయోగించాలి.

★ ఇంట్లో పిల్లలు వుంటే హోలీ రోజున ఒక బకెట్ నీళ్లు అందుబాటులో వుంచుకోవాలి. పొరపాటున ఎవరైనా మురికినీళ్లు, గుడ్లు కొడితే వెంటనే శుభ్రం చేసుకోవడానికి వీలుగానే ఈ ఏర్పాటు.

★ కారులో వెళ్లాల్సి వస్తే... కిటికీ అద్దాలు మూసేయడమే ఉత్తమం.

★ ఎవరైనా రంగులు పులుముతుంటే సాధ్యమైనంత వరకు మొహం అందకుండా చూసుకోవాలి. కుదరని పక్షంలో...ఇతరులు రంగు పులిమేటప్పుడు కళ్లు, పెదవులు గట్టిగా మూసేయాలి.

★ కళ్లజోడు పెట్టుకోవడం కూడా మంచిదే. ఎందుకంటే రసాయనాలు కలిసిన రంగులు కళ్లల్లోకి వెళితే చాలా ప్రమాదం.

★ పాతవి, నిండు రంగు బట్టలు ...ఒంటిని పూర్తిగాకప్పేసే బట్టలు వేసుకోవడం మంచిది. ఎందుకంటే కొన్ని రంగులు ఒక పట్టాన వదలవు. లేతరంగు, తెలుపు బట్టలు వేసుకుంటే తర్వాత వాటిని ఉపయోగించడానికి పనికి రావు. అందుకే ఈ ఏర్పాటు.

★ తలకు టోపీ పెట్టుకోవడం, స్కార్ఫ్ చుట్టుకోవడం మంచిదే.

ఇంట్లో తయారుచేసిన రంగులు ఉపయోగించడం ఉత్తమం. ఇవి చర్మానికి హాని చేయవు.

★ కొంతమంది బాగా చిక్కటి రంగులు పూస్తారు. అవి ఎండిపోయాక సబ్బుతో కడిగేకంటే పాలతో వాటిని తుడిస్తే త్వరగా పోతాయి. సబ్బు కంటే పాలతో శుభ్రం చేయడం వల్ల చర్మం పాడవదు.

★ కోడిగుడ్డు చెరుపు చెయ్యకపోయినా వాసన వస్తుంది. అయితేనేం జుట్టుకు మంచి కండిషనర్‌గా పని చేస్తాయి.

★ హోలీ ఆడడం పూర్తిగా అయ్యాక శుభ్రంగా స్నానం చేయండి. మధ్యమధ్యలో స్నానం చేయడం, తరచూ మొహం కడుక్కోవడం వల్ల చర్మం పాడవుతుంది. అధికమోతాదులో షాంపూ, సబ్బు పెట్టి తల స్నానం చేయడం వల్ల వెంట్రుకలు కూడా రాలిపోయే ప్రమాదం వుంది.

★ చర్మ సంబంధ సమస్యలుంటే హోలీ ఆడకపోవడమే మంచిది. ఇది మరిచి హోలీ ఆడాక చర్మం పాడయ్యాక చర్మ వైద్యులను సంప్రదించినా ప్రయోజనం నామమాత్రమే.

★ స్నేహితులు పులిమే రంగుల నుంచి తప్పించుకోవడానికి తడి నేల, బండలు, గోడలమీదగా పరుగెత్తడం. దూకడం వంటివి చాలా ప్రమాదం. చేతులు, కాళ్లు విరిగే అవకాశం ఎక్కువ.

మన ఆరోగ్యం...ఆనందం కోసమే ఈ జాగ్రత్తలని గుర్తుంచుకుంటే మంచే జరుగుతుంది మరి. ★

హోలిక... హోలీ

పురాణాల్లో హోలీకి సంబంధించిన కథ ఒకటి ప్రచారంలో వుంది. హిరణ్యకశ్యపుడు తన రాజ్యంలోని వారంతా తననే పూజించాలని కోరుకునేవాడు. అయితే అతని కుమారుడైన ప్రహ్లాదుడు మాత్రం నారాయణ భక్తుడు. ఎన్నిరకాలుగా చెప్పి చూసినా కుమారుడిలో మార్పు రాకపోవడంతో హిరణ్యకశ్యపుడు ఒక నిర్ణయానికొస్తాడు. తన చెల్లెలు హోలికకు ఒక వరం వుంది. ఎంత పెద్ద మంటలోకి వెళ్లినా ఆమెకు ఏమీ కాదు. అయితే ఒంటరిగా మాత్రమే ఈ పని చేయాలి. రెండవ విషయం మరిచిన హిరణ్యకశ్యపుడు చెల్లెలి ఒడిలో ప్రహ్లాదుడిని కూర్చుండబెట్టి మంటల్లోకి వెళ్లమంటాడు. హోలిక కాలిపోతుంది. ప్రహ్లాదుడు మాత్రం క్షేమంగా బయటపడతాడు. మంచి మీద చెడు సాధించిన విజయానికి చిహ్నంగా హోలీ పండుగ జరుపుకుంటామంటారు.





చితోడ్‌ఘడ్ చరిత్ర

ఈ మండువేసవిలో రాజస్థాన్‌లో తిరగటమంటే సాహసమే. అయితే ఎండ తీవ్రం కాకముందే చేరవలసిన ప్రదేశం చేరుకోవాలి. ఈవారం మనం చితోడ్‌ఘడ్ గురించి చెప్పకుందాం. అక్కడి చారిత్రక కట్టడాలను, భవనాలను, ఆలయాలను గురించి చెప్పకోవడానికి ముందు కొద్దిగా చితోడ్‌ఘడ్ చరిత్ర చెప్పకోవాలి. తర్వాతే మానవ నిర్మాణాల గురించి ప్రస్తావించుకుందాం.

ఊరికి తూర్పున చూచినంతలెక్క వ్యాపించివున్న పర్వతం. ఇంత విస్తారమైన శిఖరాన్నీ ఆక్రమించుకున్న చిత్తూరుఖిల్లా. పర్వతసానువుల మీదుగా వంపులు తిరుగుతూ సాగిపోయిన కోటప్రాకారం. దూరాన రేగుతున్న ఇసుకతెరలవెనుక ఉదయభానుని లేలేత కిరణం స్పర్శతో అస్పష్టంగా కనిపిస్తున్న సాహసపరంపరల దృశ్యరూపం, చిత్తూరుదుర్గం. మసకబారిన దీని ఉజ్వల చరిత్రకు, ప్రకృతి సమకూర్చిన ఉపమానంలాగుందీ అస్పష్టదృశ్యం. ఆనాటి శౌర్యప్రతాపాలకు మౌనసాక్షిగా నిలబడి, "జైమహాకాళ్" అనే ఆ రాజపుత్రుల సమర నినాదం, ఈనాటికీ ఈ కొండలలో ప్రతిధ్వనిస్తున్నట్లుంటుంది. భక్తిపారవశ్యంతో ఆలపించిన మీరాభాయి గానమాధుర్యం, సుదూరకాలంలో నుంచి వినిపిస్తూనే వుంటుంది. ఈ స్వాతంత్ర్యప్రియులు, దాస్యజీవనం కంటే, స్వేచ్ఛకొరకు మరణాన్ని సైతం తృణీకరించి, నిండుమనస్సుతో ముందుకురికిన దృశ్యాలు, శత్రువులచేతిలో శీలం కోల్పోవటం కన్నా, అగ్నికీలను ఆలింగనం చేసుకోవటానికి వెనుదీయని ఆనాటి వనితల సాహసం లాంటి రసవత్తరమైన జీవనసరళి, ఆనాటి గాధలు ఈ నిర్జీవ శిధిలాలలో ఈనాటికీ మనకు వినిపిస్తూనే వుంటాయి. చిత్తూరులో శౌర్యమూ, త్యాగమూ, భాసించకుండా రక్తధారలు చిమ్మకుండా ఏ ఒక్క సంవత్సరమూ గడవలేదంటారు. ఈ చిత్తూరు రాజ్యవంశంవారు, శ్రీరామచంద్రుని సంతతిగా భావిస్తారు.

గంభీరి నదీతీరాన నిర్మించిన ఈ చితోఢ్‌ఘఢ్‌ను, మేవారు రాజ్యానికి రాజధాని. ఈ నదికి తూర్పున వున్నది చిత్తూరు పురాతన నగరం. పశ్చిమభాగాన ఇప్పుడు నూతన నగరం వెలిసింది. గ్రీకుల దండయాత్ర సమయంలో, సింధు ప్రాంతపు వారు ఇటు వలసవచ్చి శివగణతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఆనాటి దీని రాజధాని "మాధ్యమిక". దీనినే ప్రస్తుతపు "నగరి" గ్రామంగా గుర్తించారు. ఆనాడిది అత్యంత భోగభాగ్యాలతో తులతూగింది. ప్రస్తుతమున్న చితోఢ్‌ఘఢ్‌ను, ప్రమరవంశానికి చెందిన మోరివంశీయుడు, చిత్రంగ్, నిర్మించి తన పేరుమీద చిత్రకోట అని నామకరణం చేశాడు. తరువాత 734 ఎడి ప్రాంతంలో గుహిలోత్‌కు చెందిన బప్పారావల్ (ఇతడిని కాలభోజుడని కూడా వ్యవహరిస్తారు.) ఈ చితోర్‌ను ఆక్రమించి గుహిలోత్ వంశాన్ని స్థాపించాడు. ఈయన "శైలాధీశుడు" "రాజగురు" "హిందూభానుడు" మొదలైన బిరుదులు ధరించి, పశ్చిమదిక్కుకు దండయాత్రలు చేసి, కాబూల్, కాంధహార్, ఇరాన్, తురాన్ మొదలగు దేశాలను జయించాడని గాధ. ఈయన 100సంవత్సరాలు పరిపూర్ణంగా జీవించి, చివరిదశలో భవబంధాలను వదలి, వానప్రస్థజీవితం గడిపి, అక్కడే తనువు చాలించడాడట. ఈతడి సాహసగాధలు ఎన్నో జానపదగేయాలుగా, ఈనాటికీ పల్లెలలో ఆత్మీయంగా పాడుకుంటారు. బప్పా తరువాత కుమన్ సింహాసనాన్నధిష్ఠించి, 24 విజయయాత్రలు చేసి, బప్పా స్థాపించిన రాజ్యాన్నీ, సూర్యవంశాన్నీ, విదేశీ దండయాత్రల నుంచి రక్షించుకోవటమేకాదు, బాగ్దాద్ ఖలీఫాను కూడా ఎదిరించి నిలిచాడట. ఈయన తరువాత 300 సంవత్సరాల చరిత్ర ఏమయిపోయిందో ఈనాటికీ తెలియరాలేదు. తరువాత మాళ్వాదేశాధీశుడు భోజరాజు చిత్తూరు రాజ్యాన్ని పరిపాలించి ఇక్కడ త్రిభువన నారాయణుని మందిరాన్ని నిర్మించాడు. దీనినే ఇప్పుడు, సమిద్ధేశ్వరమహాదేవ మందిరం

అంటారు. మళ్ళీ మేవారు వంశస్థుల పాలనలోనికి వచ్చి, చిత్తూరు, సొలాంకి జయసిగు నుంచి, 12వ శతాబ్దపు కర్ణిసింగు వరకూ వారి పాలనలో విలసిల్లినది. వీరిలో సమర్సి (సమరసింగ్) ఢిల్లీ పాలకుడైన పృధ్వీరాజ్ చౌహాన్ సోదరిని వివాహమాడి, అప్పటికే మహమ్మద్ ఘోరీ దండయాత్రలతో సతమతమౌతున్న పృధ్వీరాజ్‌తో కలిసి విదేశీదండయాత్ర వద్ద జరిగిన పోరులో, సమరసింగ్, ఆయన కుమారుడు కూడా వీరమరణం పొందారు. ఆ ఒక్కయుద్ధంలోనే ఆయన సైన్యంలో 13 వేలమంది నిహతులైనారంటే, వారెంత భీకరపోరాటం జరిపారో అర్థంచేసుకోవచ్చు.

13వ శతాబ్దమంతా ఢిల్లీ సుల్తానులకూ, మేవారు రాజులకూ జరిగిన నిరంతర పోరాటాలతో నిండిపోయింది. 1303 ఎడిలో అల్లావుద్దీన్ ఖిల్జీ, చిత్తూరు దుర్గాన్ని ముట్టడించాడు. ఈ ముట్టడికి, రాజ్యకాంక్ష కంటే, రాణి పద్మిని యొక్క అసాధారణ సౌందర్యమే అధికపాలు కారణమైనదంటారు. కాని అది చిత్తూరుదుర్గం. ఆనాటి రావల్‌రతన్‌సింగ్ యొక్క బలపరాక్రమాల వల్ల ఎంతకూ దుర్గప్రవేశమే సాధ్యంకాక, ఖిల్జీ ఒక వర్తమానం పంపాడట. రాణిపద్మినిని ఒక అద్దంలోనైనా తనకు చూపితేచాలు, ముట్టడి విరమించుకువెళ్ళిపోతానని. ఈ సుదీర్ఘపుముట్టడితో అలసిపోవటం వల్ల ఎలాగో దీనికంగీకరించి, సుల్తానును లోనికి తోడ్కొనివెళ్ళి, ఒక అద్దం అమర్చి దానిలో పద్మిని ప్రతిబింబాన్ని చూపారట. ఆ అసమాన సౌందర్య వైభవానికి ముగ్ధుడయ్యాడు ఖిల్జీ. ఉత్తమ సాంస్కారవంతుడైన రావల్, అతిథికి గౌరవసూచకంగా, ఖిల్జీకి వీడ్కోలిస్తూ బయటి ద్వారం వరకూ వచ్చాడట. ఇలా ఏకాంతంగా వచ్చిన రావల్‌ను ఖిల్జీ బందీగా పట్టుకుని తన శిబిరానికి తీసుకుపోయడట. ఈ వంచనకు, కుపితయైన రాణి పద్మిని తానే ఒక పథకం రచించగా, దానిననుసరించి ప్రత్యేకంగా

ఇంత జరిగి తిరిగి రాజ్యానికొచ్చిన విక్రమజిత్తును, అతడి దాయాది రణవీరుడు హత్యచేసి రాజ్యం చేజిక్కించుకున్నాడు.

ఎంపిక చేసిన రాజపుత్రవీరులు, మెరుపుదాడి చేసి రావల్‌ను విడిపించుకువచ్చారు. కానీ వీరోచిత దాడిలో ముఖ్య పాత్ర వహించిన గోరాతో సహా 500 మంది రాజపుత్ర వీరులు ప్రాణాలర్పించారు. ఇంది చేజారిపోయినా, అల్లావుద్దీన్ ఖిల్జీ తన ముట్టడి కొనసాగించాడు. ఆరు మాసాలు నిత్యపోరాటంతో, ఉత్కంఠతో మానవ సహనాన్ని పరీక్షిస్తూ మరింత సుదీర్ఘమైనట్లు భీతావహమైన అనుభూతిని మిగిల్చాడు. దుర్గంలోనున్న వనరులన్నీ హరించిపోతున్నాయి. ముట్టడి సాగుతూనే వుంది. ఇక విజయావకాశాలు మృగ్యమన్న విషయం అందరికీ తెలిసివచ్చింది. ఇక్కడ భూగృహంలో చితిమంటలు రగిల్చారు. శత్రువుపరం కాకుండా తమ మానాభిమానాలను పరిరక్షించుకోవడానికి రాజపుత్ర స్త్రీలందరూ రాణి పద్మిని ముందు రాగా, అగ్నిజ్వాలలు రేగుతున్న ఈ భూగృహంలో ప్రవేశించారు. వారి వెనుకనే తలుపులు మూసివేశారు. వారి శరీరాలు అగ్నికి ఆహుతి చేసుకున్నారు. ఈ ఆత్మార్పణను జౌహార్ అంటారు. ఇక రాజపుత్రవీరులందరూ, కాషాయాంబరాలతో సంపూర్ణంగా అలంకరించుకున్నారు. శిరస్త్రాణాలకు పూలమాలలు చుట్టుకున్నారు. దుర్గ ద్వారాన్ని బార్లా తెరిచారు. పెండ్లి కుమారులు తరలి వస్తున్నట్లుగా వారు ద్వారాన్ని దాటి బయటకు వచ్చారు.

"హరహరమహదేవ్" అనేవారి సమర నినాదంతో ఆ పర్వత సానువులు ప్రతిధ్వనించాయి. ప్రతి ఒక్కరూ నిరుపమాన పరాక్రమంతో పోరాడి వీరమరణం పొందారు. చిత్తూరు దుర్గం అల్లావుద్దీన్ వశమైనది. కానీ రాణి పద్మిని మాత్రం ఎవరికీ అందనంత సుదూర తీరాలకు వెళ్లిపోయింది. స్మశాన వాటికను తలపిస్తున్న చిత్తూరు దుర్గాన్ని ప్రవేశించాడు ఖిల్జీ. సాధారణ ప్రజలతో నున్న నగరంలో విధ్వంసం, దోపిడీ నిరాటంకంగా జరిగిపోయాయి. ఇదే అతడి 6 మాసాల ముట్టడి ఫలితం. మానవుడెంత మేధావియో అంతటి అవివేకి, క్రూరుడు కూడా. తరువాత కొంతకాలనికి చిత్తూరు మళ్ళీ రాజపుత్రుల అధీనంలోనికి వచ్చింది. అది వేరే కథ.

చిత్తూరుపై రెండవ ముట్టడి 1534 ఎడిలో జరిగింది. అప్పటి మహరాజు విక్రమజిత్తు స్త్రీలోలుడు. దురహంకారి. రాజపుత్రుల ధీరోదాత్తత లోపించింది. అందువల్ల సంస్థానాధీశులంతా విముఖులైవున్నారు. ఇదే అదనుగా భావించి గుజరాత్ నుంచి బహదూర్‌షా దండెత్తి వచ్చాడు. చిత్తూరు అపజయంపాలైంది. రాజమాత కర్ణావతితో సహా రాజపుత్ర స్త్రీలు ఇక్కడి భూగృహంలో ఆత్మార్పణ చేసుకున్నారు. ఈ భీకర పోరాటంలో 32 వేల మంది ప్రాణాలను బలిపెట్టారు. కానీ బహదూర్‌షా, ఇక్కడ రెండు వారాలు మాత్రమే వుండగలిగాడు. దీనికి కారణం రాణి కర్ణావతి, ఢిల్లీ చక్రవర్తి హుమాయూన్ చిత్తూరు పతనం విని, దండెత్తివచ్చి



వాటర్ రిజర్వాయర్

బహదూర్‌షాను గుజరాత్ వరకూ తరిమికొట్టి విక్రమజిత్తుకు రాజ్యాన్ని కట్టబెట్టారు. ఒక్కోసారి మానవుని కుసంస్కారం. దౌర్జన్యం కళ్ళు జిగేలు మనిపిస్తాయి. అలాగే మానవునికి సంస్కారం కూడా జుగుప్స కలిగిస్తుంది. ఇంత జరిగి తిరిగి రాజ్యానికొచ్చిన విక్రమజిత్తును. అతడి దాయాది రణవీరుడు హత్యచేసి రాజ్యం చేజిక్కించుకున్నాడు. విక్రమజిత్తు కుమారుడు ఉదయసింగ్ పసివాడు. ఇతడే రాజ్యానికి అసలు వారసుడు కనుక, ఆ పసికందు ప్రాణాలకు ముప్పురాకుండా పన్నా అనే దాది అతణ్ణి రహస్యంగా కాపాడింది. అదొక రసవత్తర కథ. స్త్రీలోని మాతృత్వం, కారుణ్యం సాహసం లాంటి ఎన్నో పార్శ్వాలు గోచరిస్తాయిక్కడ. ఈ గాథ ఇంతటితో ముగియలేదు. 1567లో మూడవ ముట్టడి జరిగింది. అప్పటికే పన్నా వల్ల రక్షింపబడిన ఉదయసింగ్ రణవీరుని జయించి సింహాసనాన్నధిష్టించాడు. అప్పటి ఢిల్లీ పాలకుడు అక్బర్ రాజపుత్ర స్త్రీలను వివాహమాడి, ఢిల్లీ సుల్తానులకూ, రాజపుత్రులకూ ఉన్న కయ్యాన్ని వియ్యంగా మార్చుకున్నాడు. రాజపుత్ర వనితలను మొఘలులు వివాహమాడటం, ఉదయసింగ్ గర్హించాడు. ఈ ధిక్కార ధోరణి అక్బర్ వంటి బలవంతుడైన చక్రవర్తి సహించలేక, తానే స్వయంగా, అపారమైన సైన్యంతో వచ్చి, ఇక్కడ పర్వతపాదాన శిబిరాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. ఈ అనంత సేనావాహినిని చూశాడు ఉదయసింగ్. అంతరంగికులతో చర్చించాడు. దాపులనున్న కొండలలో తలదాచుకున్నాడు. తనకు అభిమాన పాత్రులైన అధికారులు జైమల్, పట్టా అనే వారిద్దరికీ దుర్గ రక్షణభారం అప్పగించాడు. ఇక రాజపుత్రులు వీరోచితంగా జరిపిన పోరాటంలో అక్బరుచక్రవర్తే మృత్యువు నుంచి వెంట్రుక వాసిలో తప్పించుకున్నాడట. అయిదునెలలపాటు జరిగిన ఈ పోరాటంలో జైమల్ అక్బరుచేతిలో నేలకూలాడు. ప్రతి సైనికుడూ మరణించేవరకూ పోరాడాడు. సేన మొత్తం నశించింది. రాజపుత్ర స్త్రీలందరూ అగ్నికి ఆత్మార్పణ చేసుకున్నారు. టోడ్ అనే చరిత్రకారుడు ఈ ఘట్టాన్ని వర్ణిస్తూ "రాజపుత్రస్త్రీల అగ్నిప్రవేశం జరిగిపోయింది. చివరకు మిగిలిన ఎనిమిది వేలమంది రాజపుత్రవీరులు కలసికూర్చుని తమ ఆఖరిభోజనాన్ని ముగించారు. కాషాయవస్త్రాలు ధరించారు. దుర్గ ద్వారాలు బార్లా తెరిచారు. ఆత్మార్పణ మొదలైనది. తమ పసుపువర్ణపు పతాకానికి ఎవరూ కళంకం తేలేదు. ఓటమి నంగీకరించటానికి, ఒక్క సైనికుడూ మిగిలిపోలేదు. అక్బరు చిత్తూరు దుర్గం ప్రవేశించాడు. అక్కడున్న 30వేలమంది ప్రజలు విజేతలకు బలిపశువు

కోటమీద నుండి చూస్తే...



లైనారు. తలలు తెగిపడ్డాయి. రాజవంశానికి చెందిన 17 వందలమంది బలిదానంతో తమ ధర్మాన్ని నిర్వర్తించారు" అంటాడు. ఇది ఎంత హృదయవిదారకంగా జరిగిందో ఊహించుకోవచ్చు. అహంకారంతో నిండిన విజయకాంక్ష మానవరక్తంతో ఎన్ని విషాదభరిత చిత్రాలు గీచిందో!

ఇలా భయానకంగా పదేపదే జరిగిన చిత్తూరు విధ్వంసం, రాజపుత్ర శౌర్యాన్ని అణచిపెట్టలేకపోయింది. అడపాదడపా పోరాటాలు చెలరేగుతూనే వున్నాయి. అక్బర్ తన జీవితకాలంలో ఎన్నోసార్లు ఈ పోరాటాన్ని కొనసాగించవలసివచ్చింది. ఉదయసింగు మరణానంతరం, ఆయన కుమారుడు రాణాప్రతాప్‌సింగ్ తమపైన అక్బర్ సార్వభౌమత్వాన్ని అంగీకరింపలేకపోయాడు. అతడు తన దుర్గాలనన్నింటినీ పటిష్టం చేసుకున్నాడు. బలమైన సైన్య సమీకరణ పూర్తిచేశాడు. పోరాటానికి సిద్ధపడ్డాడు. అక్బర్ ఇతణ్ణి అణచటానికి మాన్‌సింగ్ నేతృత్వంలో సైన్యాలను పంపాడు. మాన్‌సింగ్ కూడా రాజపుత్రుడే. అయితే అతడు అక్బరుకు అంతరంగికుడు. స్నేహధర్మానికి త్రికరణశుద్ధిగా కట్టుబడ్డవాడు. అతడి సేవానిరతిపై అక్బరుకు అచంచల విశ్వాసముంది. అందుకే మరొక రాజపుత్రునిపై రణరంగానికి అతడి సారథ్యాన్ని, సామర్థ్యాన్ని ఎంచుకున్నాడు. ఈ పోరులో రాణాప్రతాప్ కొన్ని దుర్గాలను కోల్పోయాడు. అపారమైన మొఘల్ సేనావాహినితో తన విజయం అసాధ్యమనిపించింది. ఒక రహస్యమైన కోటలో తాత్కాలికంగా తలదాచుకున్నాడు. కానీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. త్వరలో మళ్ళీ సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. పిడుగులా విజృంభించాడు. చిత్తూరు, అజ్మీర్ మండల్‌ఘర్ తప్ప మిగిలిన మేవారు రాజ్యాన్నంతా ఒక్కదాడిలో వశపరచుకున్నాడు. ఈ సుదీర్ఘపోరాట సమయంలో ఇతడి వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఆంక్షలు స్వచ్ఛందంగా విధించుకున్నాడు. తమ రాజ్యంలో తాము స్వతంత్రులుగా జీవించటమే అతడు కాంక్షించినది. దానికిసైతం ఊహింపనలవిగాని త్యాగాలపరంపర చూస్తే ఈ జీవితమెంత నిర్దాక్షిణ్యమైన మలుపులు తిరుగుతుందో అవగతమౌతుంది. తమ సంపూర్ణ స్వాతంత్ర్యసాధనకు, తమ దైన్యస్థితి మరపునకు రానీయకుండా తమ పూర్వవైభవాన్ని తిరగి సమకూర్చుకునేవరకూ స్ఫూర్తిగా తనకూ తన సంతతివారందరికీ భోగ్యవస్తువులను నిర్జించాడు. స్వర్ణపాత్రలను త్యజించాడు. ఆకులలో భోజనం. గడ్డిపరుపులమీద విశ్రమించటం. చిత్తూరు ప్రాభవం తిరిగి వికసించేవరకూ గడ్డాలు తీయరాదు. ఇంతటి కఠోర నియమాలతో తన ధ్యేయాన్ని నిరంతరం కళ్లముందు నిలుపుకున్నా, రాణాప్రతాప్ తన జీవితకాలంలో చిత్తూరును స్వాధీనం చేసుకోలేకపోయాడు. అయినా అతడి శౌర్యప్రతాపాలూ, ధృడదీక్ష, ఎదురేలేని మొఘల్ సైన్యానికెదురునిలిచి పోరాడిన అతడి ధైర్యసాహసాలు ఎవరినైనా అబ్బురపరుస్తాయి. అతడి ప్రత్యర్థిపక్షంలోనివాడైన ఖాన్‌ఖన్నన్, రాణాప్రతాప్‌ను ప్రశంసిస్తూ ఇలా అంటాడు. "ఈ ప్రపంచంలో అన్నీ అశాశ్వతాలే, రాజ్యాలూ భోగభోగ్యాలూ అన్నీ ఒకనాటికి కనుమరుగయ్యేవే. కానీ ఒక మహాపురుషుని సౌశీల్యం కలకాలం నిలిచివుంటుంది. రాణాప్రతాప్ రాజ్యాన్నీ, భోగభాగ్యాలనూ త్యజించాడు. కానీ ఏనాడూ తల వంచలేదు. తానొక్కడుగా భారతదేశపు రాజులందరిలోకీ జాతి గౌరవాన్ని పరిరక్షించాడు. తన శత్రుశిబిరం నుంచి ఇలాంటి నాకనిపించింది. ఒక తార వెలిగింది. వెలుగులు విరజిమ్ముతూ ప్రకాశించింది. కాలవశమై రాలిపోయింది. ఇలాంటి వెలుగురేఖలే లేకపోతే చరిత్ర నిర్జీవమైపోతుంది.

రసాత్మకమైన ఈ చిత్తూరు చరిత్ర రేఖామాత్రంగానైనా మీముందుంచాలంటే ఇంతమాత్రం చెప్పాల్సిందే. ఈ నేపథ్యం లేకుండా ఇక్కడి శిథిలాలను, అవి చెప్పే కథలను అనుభవగతం చేసుకోలేము. ఇక ఈదుర్గపు విశేషాలను పైవారం చెప్పుకుందాం.

★

బనానా డ్రింక్

కావాల్సిన పదార్థాలు

అరటిపళ్ళు - 2

నిమ్మకాయలు- 2

పంచదార, నారింజ తొనలు, మీగడ - అరకప్పు

నీళ్ల - 1 గ్లాసు

ఐస్‌ముక్కలు- 2 కప్పులు

తయారు చేయు పద్ధతి

ఒక పాత్రలో అరటిపండు తొక్కతీసి బాగా పిసకాలి. అందులో నిమ్మరసం, పంచదార బాగా కలపాలి. ఐస్‌ముక్కల్లో ఈ పాత్రని పెట్టి బాగా చల్లగా చెయ్యాలి. చల్లగా వున్నప్పుడే నారింజ తొనలు చిదిమి ముత్యాలు వెయ్యాలి. మీగడ, నీళ్ళూ, కొంచెం ఐస్ వేసి బాగా కలియబెట్టాలి. గ్లాసులలో పోసుకుని తాగొచ్చు.



మిలాన్ జూస్

కావాల్సిన పదార్థాలు

పుచ్చకాయ ముక్కలు - 4

పంచదార- 50 గ్రాములు

నీళ్ళు- 2 కప్పులు

ఐస్- కొంచెం

తేనె- 1 చెంచా

తయారు చేయు పద్ధతి

పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. వీటిలో గింజలు రాకుండా చూసుకోవాలి. స్టీలు పాత్రలో నీళ్ళు పోసి పంచదార, తేనె, తరిగిన పుచ్చకాయ ముక్కలు పోసి చెంచాతో బాగా కలపాలి. దీనిని వడకట్టకూడదు. పుచ్చకాయ ముక్కలు నోట్లో వేసుకుంటే ఇట్టే కరిగిపోతాయి గనుక నమిలి మింగాల్సిన పనివుండదు. ఐస్ చేర్చుకుని తాగితే మధురంగా వుంటుంది. వేసవికాలంలో పుచ్చకాయలు విరివిగా దొరకుతాయి. కనక వేసవికాలానికి ఇది మంచి పానీయం అవుతుంది. గ్లాసులో చెంచా వేసి సర్వ్ చేస్తే తాగడానికి అనువుగా వుంటుంది.





లెమన్ జూస్

కావాల్సిన పదార్థాలు

నిమ్మకాయలు- 2, పంచదార - 4 చెంచాలు

నీళ్ళు - 2 కప్పులు, ఐస్ - చాలినంత

తయారు చేయు పద్ధతి (మొదటి పద్ధతి)

నిమ్మకాయలు రసం తీసుకొని వుంచుకోవాలి. గ్లాసులో నీళ్లూ పంచదారా, ఐస్ ముక్కలూ కలిపి ఇవ్వవచ్చు.

రెండో పద్ధతి

ఒక నిమ్మకాయని సన్నముక్కలుగాకోసి దానిలో పంచదార కలిపి ఒక పాత్రలో వుంచాలి. పదిహేను నిమిషాల తర్వాత మెత్తగా నలగ గొట్టి రసం తియ్యాలి. ఇలాచేస్తే రసంతోపాటు నిమ్మకాయ వాసన కూడా వుంటుంది. రసం తీసేటప్పుడు కొద్దిగా నీళ్ళు కూడా చేర్చవచ్చు. మరో నిమ్మకాయ రసం మామూలుగా తీయాలి. ఈ రసాన్ని మొదట తీసుకున్న నిమ్మ రసంలో కలపాలి. పంచదార, నీళ్లూ కలిపి ఐస్‌కుడా వేసుకుంటే వేసవికాలానికి మంచి పానీయం అవుతుంది.



మేంగో పంచ్

కావాల్సిన పదార్థాలు

మామిడిపళ్ళు - 2

యాలకులు - 5

పంచదార - అరకప్పు

పాలు- కప్పు

నీళ్ళు - అరకప్పు

తయారు చేయు పద్ధతి

మామిడిపళ్ల రసం తియ్యాలి. నీళ్ళూ, పంచదారా, యాలకులపొడి వేసి బాగా కలబెట్టి వడకట్టాలి. దీనికి పాలు చేరిస్తే మేంగో పంచ్ తయారవుతుంది. ఐస్ వేసుకుని కూడా తాగొచ్చు. చల్లచల్లగా బావుంటుంది.



కథ

నరనరాల్లో వివక్ష

- వై. కుసుమకుమారి

ధర్మారావు రిటైర్డు హెడ్‌కానిస్టేబుల్. ఆరడుగుల ఆజానుబాహుడు. అనారోగ్యం బాధిస్తున్నా భార్యతో కలిసి తనకంటూ మిగిలిన పెంకుటింట్లో ఏదో బ్రతకాలి తప్పదు అన్నట్టుగానే జీవిస్తుండేవాడు. కొడుకులు ముగ్గురు పొరుగూళ్ళల్లో సర్కార్ కొలువు చేస్తున్నా వారినుంచి లభించేది అంతంత మాత్రమే. పదేపదే ఉత్తరాలు రాస్తే ఆఖరికొడుకు స్పందించి నోటితో లేదనకుండా చేత్తో లేదన్నట్టుగా అడిగినదానిలో పదవవంతు ఇవ్వడం ఆనవాయితీ. మిగిలిన ఇద్దరికి ఉత్తరాలు చదివే ఓపికలేదు. ఎందుకంటే వారి నుంచి ఒక్క మనీఆర్డర్ రానే రాదు.

ధర్మారావు తాను పోలీసుగా పని చేసినప్పుడు ఎవరితో కలిసేవాడు కాదు. ఆ ఉద్యోగంలో 24గంటలు డ్యూటీయే. తెల్లపోలీసుల వద్ద పనిచేసిన అనుభవం. ఒకరకమైన క్రమశిక్షణ అతడిలో ఉండి పోయింది. పోలీసోడు పబ్లిక్‌తో రాసుకుని పూసుకుని ఉండ కూడదు. ఎవరితో మమైకం కారాదు.ప్రజలను అహర్నిశలు కాపాడే వాడే పోలీసు. ఆతరువాత స్వాతంత్రం రావడంతో వ్యవస్థలో పెను మార్పులు వచ్చాయి. చేసేపనికి చేతులు చాపడం వంటివి చోటు చేసుకున్నాయి.అయినా వాటికి దూరంగా ఉంటూనే జీతంమీదే బ్రతికాడు. పూర్వీకుల నుంచి వచ్చే పొలంపుట్ట అమ్మగా వచ్చినదాంతో ఒకపెంకుటిల్లు సమకూర్చున్నాడు.అదే అతడిఆస్తి.నామమాత్రపు పెన్షన్ పొం దుతూ భార్యతో చివరిరోజులు గడిపేవాడు. తోడుగా పాడి ఆవు ఒకటి ఉండేది. దాంతో కాలక్షేపం చేస్తుండేవాడు. ఆదంపతులకు ఏదో ఒక అనారోగ్యం. మందులకు వారివద్ద డబ్బు సరిపోయేదికాదు. నిత్యం పిల్లలకు మందులకోసం డబ్బుపంపమని ఉత్తరాలు రాస్తుండేవారు. మూడోకొడుకు పంపగా అదే ఊరిలో ఉండే అతడి స్నేహితుడు రమేష్ రానేవచ్చాడు.ఆవృద్ధ దంపతులవద్ద మందులచీటీలు తీసుకునివెళ్ళి మందులు కొనుక్కుని వచ్చి ఇచ్చాడు. దంపతులు ఇద్దరు మూడోకొడుకు నిర్వాకానికి ముందు అవాక్కయినా తప్పదనుకుని సరిపెట్టుకున్నారు.

రమేశ్‌తో మాట్లాడ్డానికి ధర్మారావుకు కులం పొర ఒకటి కళ్లకు కప్పేసింది.ఆపొర ఏమిటీ అంటే రమేష్ ధర్మారావు కులానికి చెందిన వాడే కానీ,అతడితల్లి వేరేకులం. అందుకే రమేష్ అంటే ఏమాత్రం భరించలేకపోయేవాడు. ధర్మారావు భార్య సుశీలమ్మ రమేష్ చేతులు పట్టుకుని "రేయ్ రమేష్ నాకొడుకుతో నువ్వు చిన్నప్పట్నించి వచ్చేవా డివి.మాఇంటివిషయాలు నీకు తెలుసు.నాకు ముగ్గురుకొడుకులు ఉండి ఏంలాభం? ఒక్కడూ చూడడు.పది ఉత్తరాలు రాస్తే డబ్బు మాచేతికి ఇవ్వకుండా నీతో మందులు కొనిపించాడంటే వాడిని ఏమనాలి? మామీద వాడికి నమ్మకంలేదు. మందుల పేరిట మేము వాడిని, డబ్బుకు పీడిస్తున్నామని అర్ధంవచ్చేలా ప్రవర్తించాడు." అని కళ్లలోనీళ్లు తిప్పుకుంది.

"అమ్మా క్షమించు. నాకు ఇలా తెలియదు. బాధపడకండి. ఈరోజు ఉదయం మాఅమ్మానాన్నకు వారుకోరిన మందులు నీవు కొనిచ్చేయ్‌రా. నేను తర్వాత ఇస్తాను అని ఫోన్‌లో చెప్పాడు. మందులు అంటే అత్యవసరం కదా అని పరుగెత్తుకుని వచ్చాను. ఇకనుంచి నేను వచ్చికలుస్తుంటాను."

"రేయ్ రమేశ్ నువ్వేరా ఈఅమ్మను పిడికెడు మట్టిచేయాలి. నాకొడుకుల మీద నాకు నమ్మకంలేదు". మరింత దుఃఖంతో రమేశ్ చేతుల్లో ముఖంపెట్టుకుని రోదించింది.

"ఏయ్ సుశీలా ఏమిటా పెడబొబ్బలు.ఎందుకొచ్చిన మాటలు. రమేశ్ నువ్వు మందులుకొనిఇచ్చాను అని నీఫ్రెండుకు చెప్పేయ్" ఇక వెళ్లు అన్నట్టుగానే చెప్పాడు ధర్మారావు. తనను ధర్మారావు ఎప్పుడూ ఈసడిస్తుంటాడు అనేది రమేశ్‌కు తెలుసు. ఒకరకంగా అలవాటు పడ్డాడు.అందుకే పట్టించుకోకుండా మళ్లీవస్తాను అని చెప్పి వెళ్లిపోయాడు.

సుశీలమ్మ కళ్లుతుడుచుకుంది."ఎందుకలా ముఖం చూడకుండా మాట్లాడతారు. రమేశ్ రాకుంటే మనకి మందులు వచ్చేవికావు. మనం కులాలు పట్టుకుని వేళ్లాడడం ఎందుకు? మన కులపోళ్లు వచ్చి మనల్ని ఆదుకుంటున్నారా?కడుపున పుట్టిన పిల్లలకే మనమేమి కానప్పుడు రమేశ్ దేవుడిలా వచ్చి మందులు తెచ్చి ఇచ్చి మళ్లీ వస్తానని చెప్పి వెళ్లాడు.వాడికి కాకితో కబురంపినా రెక్కలు కట్టుకుని వస్తాడు. నేను వాడిని అడిగినదానిలో తప్పేముంది? రేపు మనమేదైనా అయితే పిల్లలు వచ్చి ముట్టుకోరు" ఒకింత గొంతు పెంచి భర్తను నిలదీసింది.

"నిజమే కానీ చూస్తు కులహీనుడుతో మన చివరిపనులు చేయించుకోవడం నాకు ఇష్టంలేదు. మనకులంలో దొరతనం ఉంది. ఘోషా ఉంది.పౌరుషం ఉంది. అలాంటి మనం ఒక కులంలేని వాడిచేతుల మీదుగా మట్టిలో కలిసేది లేదు"

> **శ్మశానం పనయ్యాక ముగ్గురు కొడుకులు పెంకుటింటికి వచ్చి ముగ్గురూ ఎవరికివారే తలా ఒక తాళం వేసేసి నాదంటే నాదే అని ఒకరిమీద ఒకరు గుర్రెత్తిపోయి వెళ్లిపోయారు.**

"వాడి తల్లి మన కులం కాదు.వాడి తండ్రి మన కులపోడే. పైగా పౌరుషానికి పెద్దపేరు పడినోడు. తండ్రినిబట్టే కులం. తల్లికులంతో రమేశ్‌కు సంబంధంలేదు.అయినా నేను ఇలా వాడిని కోరడం ఇది తొలిసారికాదు. ఒకవందసార్లు కోరిఉంటాను.వాడు నాకు ఒక కొడుకులాంటోడే"

"మనపిల్లల వలన మనకర్మ ఇలా కాలింది" నుదుటి మీద కొట్టుకుంటూ అక్కణ్నించి పక్కగదిలోకి వెళ్లిపోయాడు.

రమేశ్ నెలలో రెండుమూడుసార్లు వచ్చి ఆవృద్ధ దంపతులకు కావాల్సినవి సమకూర్చి వెళ్లిపోతుండేవాడు. సుశీలమ్మకు ఒకసారి తీవ్రంగా అనారోగ్యమొచ్చి రెండురోజుల్లో కాలం చేసింది. ధర్మారావు పొన్నూరులో ఉన్న ముగ్గురు కొడుకులకు యస్.టి.డి. బూత్ నుంచి ఫోనుచేసి చెప్పాడు. కావాలనే ఉన్నఊరులో ఉండే రమేశ్‌కు చెప్పనేలేదు.ముగ్గురూ 'ఇదిగో వస్తాం అదిగో వస్తాం' అని చెప్పి ఫోనులు పెట్టేశారు. ఉదయం చనిపోయిన సుశీలమ్మ శవం రెండో గదిలో అలానే ఉండిపోయింది.సమీప బంధువులు ఏదో వచ్చామన్నట్టు వచ్చి అక్కడ ఒకేఒక ముసలాడు ఉన్నాడు. ఇక జరగవల్సినవన్నీ మననెత్తికి ఎత్తుకో వడం ఎందుకు? అని ఎవరికివారే జారుకున్నారు.ధర్మారావు పలువురిని రమ్మని బతిమాలుకున్నా ఏదో సాకుతో జారిపోయారు. ధర్మారావుకు దుఃఖమాగలేదు.సుశీల తలను తన ఒళ్లో పెట్టుకుని ఏడ్చాడు.

"నాతో కలిసి యాభైఏళ్లు జీవించావు.ఉద్యోగరీత్యా ఎన్నో ఊళ్లు పట్టుకుని తిరిగాం.ఇద్దరం కలిసి ఎన్నో కష్టాలు అనుభవించాం. పిల్లలనుకని వారికోసం అహర్నిశలు శ్రమించాం. మధ్యలో వచ్చారు మధ్యలోనే మనకి అందకుండా

పోయారు. చివరిలో మళ్లీ ఇద్దరమే మిగిలాం. నన్ను వదిలి నీవు తనువు చాలించావు. నిన్ను మట్టి చేయడానికి నాకు శక్తి ఇవ్వమని ఆదేవుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని ఏడ్చాడు.

అప్పుడే వచ్చాడు రమేశ్. "నాకు ఎందుకు కబురంపలేదు. మీ అబ్బాయి నాకు ఫోన్ చేసేవరకు తెలియదు.అన్ని ఏర్పాట్లు చేయమని నాకు ఫోన్‌లో పదేపదే చెప్పాడు.ఇంకా శవం ఇంట్లో పెట్టుకున్నారేంటి? మీరు అలా కూర్చోండి" అని సుశీలమ్మ శవాన్ని రెండుచేతులతో ఎత్తుకుని వరండాలోకి తీసుకుని వచ్చాడు.తనతో నలుగురిని తీసుకుని రావడంతో వారు మిగిలినపనులుచకచక చేయసాగారు.నేలమీద దుప్పటిపరిచారు. దానిమీద శవంచేర్చారు.తలవద్ద ఒకదీపం వెలిగించారు. చేష్టలుడిగి చూస్తున్న ధర్మారావుకు అప్పుడు కొండంత ధైర్యంవచ్చింది. అక్కణ్నించి పనులు స్పీడందుకున్నాయి.

చూస్తుండగా పాడెమీదకు శవం చేర్చేముందు నీళ్లుపోయడం వంటివి రమేశ్ కొంతమంది ఆడాళ్లను తీసుకుని వచ్చాడు. వాళ్లెవరు తన కులపోళ్లుకారు. వారు ఎవరైంది ఆరా తీస్తే శవం ఇంటినుంచి కదలదు అని ధర్మారావుకు అవగతమైంది.పంటిబిగువులో భరిస్తూనే "రేయ్ రమేశ్ నాముగ్గురు చవటలు (కొడుకులు) ఎక్కడ? ఇప్పటికి ఇంకారాలేదా?" అని అడిగాడు.

"ముగ్గురిలో పెద్దోడు సాయంత్రానికి గాని రాలేను" అని చెప్పాడు. రెండోవాడు శ్మశానానికి వచ్చేస్తానన్నాడు.మూడోవాడు అదే నాఫ్రెండు వచ్చి ఆమూల కూర్చుని ఏడుస్తున్నాడు" వివరించాడు.

మిగతా పనులు రమేశ్ ఆధ్వర్యంలో అంతా పూర్తయింది. సుశీలమ్మ ముందుచూపుతో రమేశ్‌ను పలుమార్లు తనను నీచేతుల మీదుగా మట్టిలో కలిపేయరా! అని చేతిలో చేయి వేయించుకునేది.

పదవరోజు కర్మకాండకు రమేశ్‌లాంటివాడి ప్రమేయం లేకుండా చేయాలని తనకొడుకుల్ని ధర్మారావు కోరాడు.అప్పుడు ముగ్గురు కొడుకులు ఈఒక్కవిషయంలో ఏకాభిప్రాయాన్ని తెలిపారు. రమేశ్ ఇక్కడ ఉండబట్టి ఈపనిచేయగలిగాం. మాకు ఈఊరుతో ఎలాంటి సంబంధాలు లేవు. మేము ఏమీ చేయలేం. నువ్వు వాడిలో తప్పులు వెతకడం మానుకుని పనిజరిగేట్టుచూడు. మామాటకాదంటే ఉన్నపళంగా వెళ్లిపోతాం. అప్పుడు కర్మ కూడా జరగదు."

కర్మకాండకు కావల్సిన సరుకులు, అపరకర్మలు చేసే బ్రాహ్మణులను, పుణ్యస్త్రీలను తీసుకునివచ్చాడు రమేశ్. మరోవైపు వందమందికి వండివార్చేందుకు వంటవాళ్లు. ఇల్లంతా పెద్దసందడితో నిండి పోయింది. ధర్మారావుకు రమేశ్‌జోక్యం ఇష్టంలేకున్నా అతడి ఆధ్వర్యంలో పనులు జరుగుతుంటే తట్టుకోలేని బాధను భరించాడు.

మరో ఏడాదిపాటు ఒంటరిగానే ధర్మారావు ఆపెంకుటింట్లో జీవించాడు. ధర్మారావు రమేశ్‌తో ఏమి పంపించినా 'నాకు అక్కర్లేదు' అని కరాకండిగా చెప్పేయడంతో మూడో కొడుకు ఠంచన్‌గా మనియార్డర్ చేసేవాడు.ధర్మారావు తీవ్రంగా అనారోగ్యంపాలయి మంచాన పడిపోయాడు.పక్కింటివాళ్లు జాలిపడి ఫోనుల్లో ముగ్గురి కొడుకులకు చెప్పారు.అప్పుడు ఆముగ్గురి తరుపున వచ్చాడు రమేశ్. వస్తూనే ఒక డాక్టర్‌ను తీసుకుని వచ్చాడు.ధర్మారావును చూసి రెండు ఇంజక్షన్లు ఇచ్చి పెదవి విరిచి వెళ్లిపోయాడు.

ఇంటికి వచ్చి సేవలు అందించిన రమేశ్‌ను చూసి కొంతసేపు వరకు మాట్లాడలేకపోయాడు.ఇంటికి వచ్చిన వాడితో మాట్లాడక పోవడం తప్పని పలకరించాడు."ఏరా నాగురించి డాక్టరు ఏమిచెప్పాడు?"

"పర్వాలేదని చెప్పాడు"

"నేను చచ్చేలోపు నాకొడుకుల్ని చూడడం కుదరదా?"

రమేశ్ బదులీయలేదు. వేడిపాలు, రొట్టె ధర్మారావుకు అందించాడు. మారుమాటాడకుండా వేడిపాలు తాగాక కుదుటపడ్డాడు."రమేశ్ నేను పూర్వీకుడిని.నాకు కొంతకులపిచ్చి ఉంది.ఎప్పటికప్పుడు నీవిషయంలో బయట పడిపోతూనే ఉన్నాను.నాభార్య నీచేతిలో చేయివేయించుకుని నీచేతుల్లోంచి వెళ్లిపోయింది. దానికి నాకంటే కులపిచ్చి ఎక్కువ. కానీ, మాపిల్లల నైజం దానికి తెలుసురా. అందుకేరా దిగివచ్చి నీతో తన చివరి మజిలీని పూర్తిచేసుకుంది.వాస్తవానికి మాకంటే ధనికుడవు. సమాజంలో నీతండ్రి పలుకుబడికూడా ఎక్కువే. నిన్ను ఇక్కడ నేనెలా అవమానిస్తున్నా సహించావు. ఎందుకంటే నామూడోకొడుకుతో నీ బాల్యస్నేహం అలాంటిది. దాన్ని ఆసరాగా తీసుకుని మిగిలిన ఇద్దరు కొడులు నీతో మా పనులు చేయించుకుంటున్నారు"

రమేశ్ మౌనంగా చూశాడు. ధర్మారావు ఇంతగా తన తప్పును చెప్పుకుంటాడని కలలోకూడా అనుకోలేదు. నన్ను నీచేత్తోనే పిడికెడు మట్టిని చేసేయ్‌రా! అని అడుగుతాడు అని రమేశ్ చూశాడు. కానీ, ధర్మారావులో అదేం కన్పించలేదు. ఎంత వరకు చెప్పాలో అంతవరకే అన్నట్టుగానే ఉన్నాడు.అతడిలో విషవృక్షంలా పెరిగిన కులపిచ్చిని అతడు తరిమేయలేకపోయాడు. రమేశ్ అక్కణ్నించి మౌనంగా కదిలాడు. అక్కడికి వారం తరువాత ధర్మారావు కన్నుమూశాడు.

పొరుగింటిలోవారు ధర్మారావు అలికిడిలేదేం చెప్మా అని మధ్యాహ్నం లోపలికివచ్చి చూసి తప్పదని ముగ్గురు కొడుకులకు ఫోన్లుచేశారు. వారు రమేశ్‌కు ఫోన్‌చేసి ధర్మారావు శవంవద్దకు వెంటనే వెళ్లేట్టు చేశారు. చకచకా పనులు పూర్తిఅయి శవం కదిలిపోయింది. కులం వాళ్లు అలా ఇలా రాగా ముగ్గురు కొడుకులు ఏదో వచ్చాం మాకు తప్పదు అన్నట్టుగానే అక్కడ రమేశ్ ఏమిచెబితే అదే చేశారు.

శ్మశానం పనయ్యాక ముగ్గురు కొడుకులు పెంకుటింటికి వచ్చి ముగ్గురూ ఎవరికివారే తలా ఒక తాళం వేసేసి నాదంటే నాదే అని ఒకరిమీద ఒకరు గుర్రెత్తిపోయి వెళ్లిపోయారు. రమేశ్‌కూడా ఇంటికి వెళ్లిపోయాడు. ఇదంతా రెండుమూడుగంటల్లో అయిపోయింది. ఇరుగు పొరుగు ముక్కున వేలేసుకున్నారు. వీళ్లేం పిల్లలు? దశ దినాలు జరగాల్సిన కర్మలు, గాలికి వదిలేసి ఊరువదిలి ఎవరినెలవులకు వారు వెళ్లిపోవడం పదేపదే చర్చించుకుని అసహ్యించుకున్నారు.

ఇక శ్మశానంలో కాటికాపర్లు కాలుతున్న చితిని వదిలి బ్రాందీ షాపుకువెళ్లి అక్కడ పూటుగా తాగి తిరిగి వచ్చారు. కాడు చల్లారి పోయి ఉంది. కర్రలు కాలిపోయాయి.శవం పూర్తిగా కాలకుండా పక్కకు ఒరిగి పోయిఉంది. దాంతో కాపర్లు కళ్లు సాగదీసుకుని చూసి మనం అటు వెళ్లామోలేదో శవం పక్కకు పడిపోయింది.కర్రలు అన్ని కాలిపోయాయి. ఇప్పుడెలా?పదరా ఆముగ్గురు కొడుకులు ఇంటివద్ద ఉంటారు అడుగుదాం అని పరుగులుతీసారు.పెంకుటింటికి తాళం వేసుండడంతో రమేశ్ ఇంటికి పరుగులు తీశారు. అక్కడ అతడు లేడని తెలియడంతో ఏమిచేయాలో పాలుపోలేదు.

విషయం తెలిసిన ఒకరిద్దరు 'సగం కాలిన శవాన్ని వదిలేస్తే పెద్ద నేరమవుతుంది. ధర్మారావు రిటైర్డు పోలీసు. ఒకసారి పోలీసులకు విషయం చెప్పండి' అని ఉచిత సలహా ఇచ్చారు.

పోలీసుస్టేషన్‌కు వెళ్లారు.అక్కడ దొంగవస్తువులు కొన్న వర్తకుడ్ని పట్టితెచ్చి వాడి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు పోలీసులు. మద్యం మత్తులో జోగుతున్న కాపర్లను చూసి యస్.ఐ. "ఏరా! ఎవడినైనా ఖతమ్ చేసి సరెండర్ అవుతున్నారా?మీవాలకం చూస్తే పొడిచి వచ్చినట్టే ఉన్నారు" అని లాఠీతో ముందుకు వచ్చాడు.

"అయ్యా! మేము కాపరులం. ఒక బాబు చచ్చిపోతే దహనం చేస్తున్నాం. శవం ఒకవంతు మిగిలిపోయి మొరుడులా పక్కకు ఒరిగిపోయింది. కర్రలు కోసం ఆబాబు ఇంటికి వెడితే అక్కడ ఎవరూలేరు. అందుకే ఇక్కడికి వచ్చాం" అని ఇద్దరిలో ఒకడు చెప్పాడు.

"ఏమిట్రా నీఫిర్యాదు. చచ్చిన శవాలు తగలడ్డంలో అటుఇటు అయితే అది పోలీసోడి బాధ్యతలా చెబుతున్నావు. చచ్చినవాడి బంధువులుంటారు వారినడుగు ఫో!"

"అయ్యా కోపం వద్దు. ఆబాబుకు బంధువులు ఎవరో మాకు తెలి యదు. పైగా ఆబాబు ఒకప్పుడు మీపోలీసు ఉద్యోగం చేసేటోరు" చిన్నగొంతుతో చెప్పాడు.

ఆమాటలకు యస్.ఐ.ఆశ్చర్యంతో కళ్లుతెరిచాడు.అక్కడే ఉన్న పోలీసులు విని గుమిగూడారు.ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. యస్.ఐ. తల పట్టుకున్నాడు.అప్పుడే వర్తకునివద్ద వసూలు చేసిన నోట్లు కాటికాపర్లకు ఇచ్చి యస్.ఐ.సీటులో కూలబడ్డాడు. కానిస్టేబుళ్లు నోటమాటరాకుండా అయిపోయారు. ★

కథా నిలయం
శ్రీకాకుళం

కూర

బీర్బల్ కథలు

పేరేమిటో...!

హాలో పిల్లలూ... పై బొమ్మ చూడ్డానికి ఓ మనిషి మొహంలా వుంది కదూ. నిజమే కానీ, కాస్త పరిశీలించి చూస్తే కొన్ని ఇంగ్లీష్ అక్షరాలు ఉన్నాయి. ఈ అక్షరాలన్నింటినీ ఒక క్రమంలో పెడితే ఒక అమ్మాయి పేరు వస్తుంది. ఆ పేరేమిటో చెప్పండి చూద్దాం.

కార్టూన్



ఈ బోర్డు చదివి, దాని ప్రకారం మనం స్కూల్‌కి వెళ్లామంటే లేటుగా చేరతామేమో...!



ఎలా?

హాలో ఫ్రెండ్స్... పైన బోలెడన్ని అంకెలు, గుర్తులు వున్నాయికదా. వాటిని = ఉపయోగించి చెప్పండి

జవాబులు

పేరేమిటో...?: CALON

ఎలా?: 72-10X5=66÷3



పదాలు ఎక్కడ?:



పదాలు ఎక్కడ?

హాలో బుజ్జాయిలూ...ఇక్కడ బోలెడు ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయి. వాటిలో కొన్ని పదాలు దాక్కొని ఉన్నాయి. అవి అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా ఉండొచ్చు. మీరు వాటిని వెతికి పట్టుకోవాలి. ఇంతకీ ఆ పదాలు ఏవంటే...APACHE, PIZZA, TEEPEE, OLAFFUB, EVITAN, OMINOREG, TRIBE, SEGDEW, LITTLESIOUX, WIGWAMMRX.

A	G	E	T	F	G	W	E	T	T	S	T
O	A	S	R	P	Y	E	M	L	E	H	D
S	U	P	I	Z	Z	A	W	Y	E	W	C
L	O	L	A	F	F	U	B	A	P	W	J
T	O	E	W	C	S	R	P	Y	E	I	H
W	C	V	H	D	H	T	O	D	E	G	G
O	M	I	N	O	R	E	G	S	A	W	E
S	I	T	R	I	B	E	I	E	O	A	T
R	E	A	S	A	S	S	T	L	C	M	F
W	O	N	A	G	E	T	F	G	W	M	V
F	D	A	O	E	T	F	F	W	E	R	C
L	I	T	T	L	E	S	I	O	U	X	W



దారి కనిపెట్టేస్తేపోలా!

చుక్కలు కలిపేద్దాం



రంగులు వేద్దామా

అట్టమీది కథ

'నాకు బంగారం ఇష్టం లేదు' అని ఎవరైనా చెప్తుంటే విన్నారటండీ. ఊహూ...ఆ ఛాన్సే లేదు. ఈ నాలుగక్షరాల లోహంలో వున్న మహిమ అలాంటిది. ఏ ఇద్దరు మహిళలు ఏ ఒక్క విషయంలోనూ ఏకాభిప్రాయానికి రారని అంటుంటారు. అలాంటి మహిళలందరి మనసులను హోల్‌సేల్‌గా కొల్లగొట్టే సమ్మోహనశక్తి గల వస్తువు ఒకటుంది. అదే బంగారం. బంగారానికి పడిపోని కాంత వుంటుందా చెప్పండి. ఈ నాలుగక్షరాల లోహం కోసం చరిత్రలో ఎన్ని యుద్ధాలు జరిగాయో...ఎన్ని ప్రాణాలు గాలిలో కలిశాయో.. ఎంత రక్తం ఏరులై పారిందో.... చెప్పలేమంటారు. ఈ పుత్తడికోసం ఎంతమంది పరుసవేదులుగా తయారయ్యారో లెక్కించలేం. పుత్తడి నిధుల కోసం చీమలు దూరని చిట్టడవుల్లో...కాకులు దూరని కారడవుల్లో అన్వేషిస్తూ ప్రాణాలు కోల్పోయినవారెందరో! అప్పటికీ ఇప్పటికీ దాని మీద వున్న క్రేజు...మోజు అలాంటిది మరి. మార్కెట్లో ధర ఎంత పలుకుతున్నా... కొనాల్సిందే..ధరించాల్సిందే... అదే బంగారం.



బంగారు లోకం

- కె. అంజన

'**మా**కు నయా పైసా కట్నం వద్దండీ. పిల్లను అప్పచెప్తే చాలు. కాకపోతే అమ్మాయి మరీ బోసిగా లేకుండా ఏదో ఓ వడ్డాణం...పది తులాల కాసుల పేరు చేయించండి చాలు' అంటే చాలు... పిల్ల తల్లిదండ్రులిద్దరూ ఢామ్మని పడిపోవాల్సిందే. ఒకవేళ ఎప్పటికో తేరుకుని లేచినా... 'మాకీ సంబంధం వద్దనే వద్దు బాబోయ్' అని పరుగు లంకించుకోవాల్సిందే.

సుబ్బారావుగారి కుమార్తె పెళ్లికి ముహూర్తం నిర్ణయించుకున్నారు. పెళ్లి ప్రస్తావన వచ్చిందీ అంటే బంగారం కొనాల్సిందేకదా. పెళ్లికొడుకు... పెళ్లికూతురు తర్వాత పెళ్లికి కావాల్సింది బంగారమేనాయె. అందుకే పెళ్లి బడ్జెట్‌లో బంగారానికి కొంత కేటాయించారు. కాకపోతే అది బంగారం ధర పెరగక ముందు. తీరా ఇప్పుడు బంగారం కొందామంటే... ధర చుక్కలనంటింది. అనుకున్న మొత్తానికి అనుకున్నంత బంగారం రాదు. ఏం చేయాలి? అలాగని పెళ్లి ఆపుకోలేరుకదా. అందుకే అనుకున్న మొత్తానికి వచ్చినమేర బంగారంతో సరిపుచ్చుకోవాలని నిశ్చయించుకున్నారు. కాకపోతే పాత బంగారం మార్చుకుని కొత్త వెరైటీలు తీసుకోవాలనుకున్నారు.

కొందరైతే పెళ్లిళ్లకు పది తులాలు కొనాలనుకున్నప్పటికీ ఐదు తులాలకు దిగివస్తున్నారు. ఇంకొందరైతే ప్రస్తుతానికి కొంత బంగారం కొని... ధరలు తగ్గితే భవిష్యత్‌లో కొనాలనుకుంటున్నారు. పైగా బంగారం కంటే వాహనాలను కొనివ్వడానికే మొగ్గు చూపుతున్నారు.

మరికొందరైతే ఎటూ ధర పెరిగింది కాబట్టి... ఇంట్లో ఉపయోగం లేకుండా పడివున్న ఆభరణాలను, విరిగి అరిగిపోయిన నగలను అమ్మి సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు. కాకపోతే కొనడానికి వ్యాపారులందరూ సుముఖత చూపించడంలేదు. అందుకే అంటారు 'కొనబోతే కొరివి అమ్మబోతే అడవి' అని. అలా వుంది ప్రస్తుతం బంగారం పరిస్థితి. పది గ్రాముల ధర 16 వేల రూపాయలదాకా పలుకుతుంటే అలా కాక మరెలా వుంటుంది చెప్పండి?!

ధర చూస్తే కొనేట్టు లేకపోయినా ... ఈ సందర్భంగానైనా బంగారం కబుర్లు చెప్పుకుందామా!

అమూల్యం ... ఆరాధ్యం

బంగారం ప్రపంచంలోకెల్లా అత్యంత అమూల్యమైన లోహం. ఇది లేని చోటంటూ లేదు. నదులు, సముద్రాలు, నేల... అన్నిచోట్లా వుంటుంది. ఆఖరుకు చెట్లు...జంతువుల్లో కూడా పుత్తడి రేణువులుంటాయి. అయితే దీన్ని బయటికి తీయడమే ఖర్చుతో కూడుకున్న పని.



మూడు టన్నుల మట్టిని శుద్ధి చేస్తే సింపుల్‌గా ఔన్సు బంగారం చేతికొస్తుంది. సగటున వంద కోట్ల మట్టి రేణువుల్లో కేవలం మూడే బంగారు రేణువులుంటాయి. మనకు కావాల్సిన లక్షణాలుండడం వల్ల ... అరుదైన లోహం కావడం వల్ల దీన్ని మనం ఆభరణాల తయారీకి ఉపయోగిస్తున్నాం. ప్రపంచంలోకెల్లా అత్యధిక పసిడిని ఉత్పత్తి చేసే ప్రదేశాలలో నిన్నమొన్నటిదాకా దక్షిణాఫ్రికాదే పైచేయి. అంతర్జాతీయంగా బంగారం అవసరాలను ఈ గనులే తీర్చేవి. అయితే తవ్వుకుని వాడుతూ వుంటే ఎంత పెద్ద గనులైనా వట్టిపోతాయికదా. ఒక్క దక్షిణాఫ్రికాలోనే కాదు ఆస్ట్రేలియా, పెరూ వంటి దేశాల్లోనూ బంగారు నిల్వలు అడుగంటిపోయే స్థితి వచ్చింది. ఇదే విధంగా తవ్వుకుంటూ పోతే కొన్ని దశాబ్దాలకాలంలో పుత్తడి నిల్వలన్నీ ఖాళీ అయ్యే ప్రమాదం వుంది. అయితేనేం బంగారం మీద మానవుడి మోజు మాత్రం తీరనిది. వేటాడుతూనే వుంటాడు. ఒకదేశంలో కాకపోతే మరో దేశంలో. ఒక ప్రాంతంలో కాకపోతే మరో ప్రదేశంలో. అక్కడా కాకపోతే నీళ్లల్లో...! అంతేకానీ దానిమీద ఆశ మాత్రం వదులుకోడు. మరి అది బంగారం కదా! దాని మీద ఆశ అలాంటిది కదా!!

ఆహారం...ఆరోగ్యం... బంగారం

'గరీబైనా...నవాబైనా తినేది నాలుగు అన్నం మెతుకులే. డబ్బున్నంత మాత్రాన బంగారం తినరు కదా' అంటుంటారు మాట వరసకి. కానీ ఆ మాట నిజం కాదండోయ్! బాగా డబ్బుంటే బంగారమే తినొచ్చు. తినొచ్చు కాదు. తింటున్నారుకూడా. అదీ విపరీతంగా. ఈ మధ్య ఓ పత్రిక చేసిన అధ్యయనంలో ఈ విషయమే తేలింది. అత్యంత ఖరీదైన ఆహార పదార్థాల్లో బంగారానిదే తొలి స్థానం. చుక్కలనంటిన బంగారం ధరలు గుర్తొచ్చి కాస్త కంగారుగా అనిపించినా ఇది వాస్తవం. బంగారాన్ని అతి పల్చటి రేకులా చేసుకొని వేడన్నం మీద పెట్టుకుని తినడం గురించి చిన్నప్పుడు విన్నా... నమ్మకం వుండేదికాదు. ఇప్పుడు ఈ అధ్యయనం గురించి చదివాక మాత్రం నిజమే సుమా! అనిపించింది. అన్నట్టు మన భారతీయులే ఏటా 12 వేల కిలోల బంగారాన్ని శుభ్రంగా భోంచేస్తున్నారు. ఇతర లోహాలను తింటే కొందరికి అలర్జీలు వస్తుంటాయి. కానీ బంగారం వల్ల ఎటువంటి సమస్యలు రావు. అందుకే గుటకాయస్వాహా చేస్తుంటారు. ఐరోపా అమెరికా దేశాల్లో కూడా బంగారాన్ని తినడం ఎప్పటినుంచో వుంది. ఫ్రాన్స్, ఇటలీల్లో మాంచి వంటగాళ్లు తమ వంటకాలను బంగారపు పూతతోనే అలంకరిస్తారు. ఇదేకాదండోయ్! మాంచి ఖరీదైన కేకులు, చాక్లెట్లు, స్వీట్ల మీద పుత్తడి రేకుల్ని అలంకరించడం సాధారణమైపోయింది. జపాన్‌లో అయితే నూతన సంవత్సరంలోకి అడుగెట్టే శుభసందర్భంగా తీసుకునే పానీయాల్లో పుత్తడిపొడి కలపాల్సిందే. ఆస్కార్ వేడుకల్లో పొంగే షాంపేన్ నురగల్లో పసిడి మెరుపులు వుండాల్సిందే. స్విట్జర్లాండ్‌కు చెందిన లారెట్, డెలాఫె వంటి కంపెనీలు తయారుచేసే లాలీపాప్‌లు, చాక్లెట్లు, సిగార్‌లపైనా బంగారపు కాంతులు కనిపించాల్సిందే. 'అయితే బంగారం గట్టిగా వుంటుందికదా. మరి దాన్ని ఎలా తినడం?' అన్న అనుమానం వస్తుందెవరికైనా. తినే బంగారాన్ని మూడు రకాలుగా తయారుచేస్తారు. వెడల్పాటి పల్చటి ఆకులు, రేకులు, పొడి రూపాల్లో రూపొందిస్తారు. అయితే ఇందుకు స్వచ్ఛమైన బంగారాన్నే వాడాలి. కల్తీ పనికిరాదు. అయితే తినడానికి చేసిన బంగారాన్ని ఎలా వాడతారో తెలిస్తే ఆశ్చర్యపోవడం ఖాయం. పసిడిరేకుల్ని చేత్తో తాకకూడదు. ఎందుకంటే... చాలా పల్చగా వుండడంతో అవి చేతులకు అతుక్కుపోతాయి. వీటిని సన్నటి వెదురు కర్రపుల్లలతోనే అద్దుతారు. అయితే అలంకరించే పదార్థం మాత్రం కాస్త తడిగా వుండాలి. అప్పుడే బంగారం అతుక్కుంటుంది. అదే షాంపేన్‌లో అయితే

పసిడి కబుర్లు

★ పుత్తడి రసాయన సంకేతం ఎయు. ఇది ఆరమ్ అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. ప్రకాశించే ఉదయం అని దీనర్థం.

★ మానవుడు వాడిన తొట్టతొలి లోహం బంగారమేనంటారు మరి!

★ వెండి, రాగి, కంచు, ఇత్తడి వంటి లోహాలు వాతావరణ కాలుష్యానికి గురవుతాయికానీ బంగారం మాత్రం చిన్నపాటి ఉష్ణోగ్రతకూ, గాలికాలుష్యాలకూ లొంగేరకం కాదు.

★ పుత్తడికి సాగే గుణం ఎక్కువ. ఒక గ్రాము బంగారాన్ని సాగదీస్తే చదరపు మీటరు పొడవు రేకు తయారవుతుంది. ఇంకా పల్చపాటి రేకులాకూడా సాగదీయొచ్చు. ఎంత పల్చగా అంటారా! దానికి ఒక పక్కన టార్చిలైట్ వేస్తే ఆ వెలుగు రెండో వైపున కనిపిస్తుంది.



★ మేలిమి బంగారం మెత్తగా వుంటుంది. ఆభరణాలను తయారుచేయాలంటే మాత్రం ఇతర లోహాలను కలపాల్సిందే.

ముందుగా గ్లాసులో బంగారం పొడి చల్లాకే పానీయాన్ని ఒంపుతారు. టీకాఫీల్లోనూ అంతే. పుట్టినరోజులకూ, పెళ్లిరోజులకూ పళ్లు, కేకులమీద శుభాకాంక్షలు కూడా పుత్తడి అద్దిన అక్షరాలతోనే చెప్పేసుకుంటున్నారు. డబ్బుంటే పచ్చడిమెతుకులేం ఖర్మ ఏకంగా పుత్తడే ఆరగించొచ్చన్నమాట. జీర్ణశక్తిని పెంపొందిస్తాయని బంగారం, వెండిని మనదేశంలోనూ, పొరుగున వున్న చైనాలోనూ వైద్యంగా వాడుతుంటారు. హోమియో పతి మందుల్లోనూ వీటిని కలుపుతారు. దంతాల్లో ఫిల్లింగ్ కోసమూ బంగారాన్ని వాడతారు. క్రీస్తుపూర్వం 7వ శతాబ్దంలో ఇటలీలోని దంతవైద్యులు కట్టుడు పళ్లు బిగించడానికి బంగారాన్నే వాడేవారు.

బంగారం...రంగు

బంగారు ఆభరణాలు చేయించుకుని అలంకరించుకుని అద్దంలో చూసుకుని తెగ మురిసిపోతుంటాం మనం. ఆభరణాలకోసం అచ్చంగా మన భారతీయులు ఉపయోగించే బంగారమే ఐదారు లక్షల కిలోల వరకు వుంటుంది. అయితే అందులో మూడు లక్షల కిలోల వరకు పాత బంగారాన్నే కరిగిస్తుంటామనుకోండి. కాస్త పరిశీలనగా చూస్తే బంగారం రంగులో తేడాలు కనిపిస్తాయి. కొన్ని నగలు పసుపుడాలుగా... కొన్ని ఎర్రడాలుగా వుంటాయి. ఇలా ఎందుకో తెల్సా! అచ్చమైన స్వచ్ఛమైన మేలిమి బంగారానికి సాగే లక్షణం ఎక్కువ. మెత్తగా వుంటుంది. అందులో రాగి, వెండి, నికెల్ లాంటి లోహాలు కలిపితేనే గట్టిదనం వస్తుంది. అందుకే ఆభరణాల వర్ణంలోనూ మార్పు వస్తుంది. పసిడికి రాగి కలిపితే ఎరుపు వర్ణానికి తిరుగుతుంది. అదే మరికొంచెం ఎక్కువగా కలిపితే గులాబీ రంగులోకి వస్తుంది. మరీ ఎక్కువగా కలిపితే కంచులాగా తయారౌతుంది. వెండి కలిపితే పాలిపోయినట్టు కనిపిస్తుంది. అల్యూమినియం కలిపితే ఊదా రంగుకొచ్చేస్తుంది. ఇనుము కలిపితే నీలివర్ణం కనిపిస్తుంది. నికెల్/పల్లాడియం కలిపితే తెల్ల బంగారం తయారైనట్టే. బంగారంలో కలిపే లోహాలను బట్టే ఆయా ఆభరణాలను ధరించినప్పుడు కొందరికి ఎలర్జీలు అవీ వస్తుంటాయి.

బంగారు బ్యాంక్

మనకు అప్పుడప్పుడు కలలు వస్తుంటాయి. అందులో మనం వుండే ఇల్లంతా బంగారమే. ఆఖరుకు గోడల్లోని ఇటుకలు కూడా. మనం బంగారు ఊయలలో ఊగుతూ... బంగారు పళ్లెంలో భోజనం ఆరగిస్తుంటాం. అదీ పరిచారికలు అందిస్తుంటే. మా గొప్ప కల కదూ. కాకపోతే కళ్లు తెరిచి చూస్తే అద్దె కొంప వెక్కిరిస్తూ కనిపిస్తుంటుంది. అయితే నిజంగా కూడా అలా బంగారు బిస్కెట్లను ఇటుకల్లా వరుసగా పేరుస్తారు తెల్సా! ఎక్కడంటే... న్యూయార్క్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్‌లో వున్న గోల్డ్ వాల్ట్‌లో. అక్కడ ఏకంగా యాభైవేల కిలోల బంగారు ఇటుకల్ని అలా పేర్చి నిల్వ వుంచుతారు. ప్రపంచంలోకెల్లా అత్యధిక బంగారునిల్వలున్న బ్యాంకు ఇదే. 1927 నాటికే ప్రపంచంలోని బంగారునిల్వల్లో పదిశాతం ఈ బ్యాంకులోనే మూల్గుతోంది. అయితే ఈ బంగారమంతా అమెరికాదే అనుకుంటే మాత్రం పొరపాటే. అరవై దేశాలూ, బ్యాంకులూ, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలూ కలిసి అక్కడ దాచుకున్న పసిడి అదంతా. ఇక్కడ ఒక్కో బంగారు ఇటుక బరువు 12.43 కిలోలుంటుంది!

చరిత్రలో బంగారం

చిన్న పెద్ద ధనిక పేద తేడాల్లేకుండా అందరి మనసులను ఇట్టే దోచుకునే



అప్పట్లో అంత చవక మరీ...

'బంగారం ధర ఇప్పుడు భగభగ మండిపోతోందికానీ... ఒకప్పుడు కారు చవక' అంటే ఎవరూ నమ్మకపోగా ఈ మాట అన్నవారిని ఎగాదిగా చూసినా ఆశ్చర్యంలేదు. అలా వుంది ప్రస్తుతం మార్కెట్లో బంగారం ధర. అక్షరాలా పదహారువేల రూపాయలు పర్స్‌లో పెట్టికెళితే కానీ పట్టుమని పది గ్రాముల బంగారం రాదు. కానీ ఒకప్పుడు జస్ట్ పద్దెనిమిది రూపాయలు ఇస్తే చాలు తులం పుత్తడి ఇచ్చేవారు. కావాలంటే... ఓ మారు ఈ ధరలు పరికించండి...

సంవత్సరం	పదిగ్రాముల ధర (రూపాయలలో)
1925	18
1930	18
1935	30
1940	36
1945	62
1950	99
1955	79
1960	111
1965	71
1970	184
1975	540
1980	1330
1985	2130
1990	3200
1995	4658
2000	4395
2001	4410
2002	5030
2003	5747
2004	6474
2005	7680
2006	8120
2007	9500
2008	14000
2009	(ఇటీవలే పదహారువేల దాకా పలుకుతోంది)



మాంచి పెట్టుబడి

ఇప్పుడు ధరలన్నీ తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయ్. నిత్యవసర/అత్యవసర ధరలు మనల్ని పిండేస్తున్నాయ్. ఉన్న కొద్ది సంపదనైనా దాచుకుందామా అంటే ఎలా అనేది పెద్ద మీమాంస. నిన్నటి వరకు "భూమి" బూమ్ వదిలింది. ఇప్పుడది తుస్సుమంది. షేర్ మార్కెట్ రాకెట్‌లా 21,000కు పోయింది. ఇప్పుడదీ నేల కూలింది. ఊరించిన బ్యాంక్ డిపాజిట్ రేట్లు చేదయ్యాయి. అందుకే ఇప్పుడు అందరి ఛాయిస్ ఒక్కటే. అదే బంగారం. దీని ధర మాత్రం దేనితో సంబంధం లేకుండా పెరుగుతూ పోతోంది. అంతెందుకు మూడేళ్ల క్రితం (2006లో) రూ.8120 ధర పలికిన బంగారం ఇప్పుడు రెండు రెట్లు పెరిగింది. అందుకే బంగారం మీద పెట్టుబడి పెడితే నయం కదా!

ఒకేఒక్క లోహం బంగారం. అమాయకంగా మెరుపుల్ మెరిపిస్తుండే ఈ నాజూకు లోహానికి చరిత్ర చాలా వుందండోయ్. ఈజిప్షియన్ పిరమిడ్లు తెల్సుగా. వాటిలో బోలెడన్ని బంగారునిల్వలు లభించాయి. క్రీపూ 2700-2270 మధ్య కాలంలోనే ఈజిప్టు రాజులు బంగారు నాణేలను వాడారు. అప్పట్లో అక్కడసలు మట్టికంటే బంగారమే ఎక్కువగా వుండేదని చెప్తుంటారు. అయితే తమాషా ఏంటంటే ఈజిప్టు ప్రజలు బంగారాన్ని తమ అందానికి మెరుగులు దిద్దే ఆభరణాలుగానే వాడేరు మినహా ధనంలాగా ఉపయోగించినట్టు ఎక్కడా లేదు. మరి బంగారాన్ని మొదటిసారిగా కరెన్సీలాగా వాడింది ఎవరబ్బా? అంటే మాత్రం పశ్చిమటర్కీని ఏలిన క్రొయేసస్ రాజు పేరు చెప్పుకోవాల్సిందే. ఈయన క్రీపూ 560 అప్పుడనుకుంటా బంగారు నాణేలను భారీగా తయారుచేయించి మార్కెట్లోకి వదిలేడు. అన్నట్టు బైబిల్‌లో కూడా బంగారం ప్రస్తావన వుంది. బెత్లెహాంలో పుట్టిన బాల ఏసుకు ముట్టిన ప్రథమ బహుమతి బంగారమే. పురాతన భారతదేశంలోనూ బంగారునాణేలు చెలామణిలో వుండేవంటారు.

పెట్టుపోతలు...నమ్మకాలు

మనకు బంగారం ఎంతో అపురూపమైనది. ప్రధానమైనది. పిల్లలు పుట్టినప్పుడు... పెళ్లిళ్ల జరిగినప్పుడు... కొన్ని ప్రత్యేక సందర్భాలలోనూ మార్కెట్‌కెళ్లి పుత్తడి కొనాల్సిందే. ఘనంగా వేడుక జరుపుకోవాల్సిందే. అక్షయ తృతీయ, ధన్‌తెరా సందర్భాలలో తప్పనిసరిగా బంగారం కొనాల్సిందే. బంగారాన్ని లక్ష్మీదేవి ప్రతిరూపంగా భావించడం వల్ల కూడా ఈ ఆనవాయితీ కొనసాగుతోందనుకోవచ్చు. పైగా ఆరోజు బంగారం కొంటే ఏడాదంతా మంచే జరుగుతుందని ఓ నమ్మకం మరి! పెళ్లిలో ఆడపిల్లకు పెట్టే బంగారాన్ని స్త్రీ ధనం అంటారు. కష్టకాలంలో ఆడపిల్లలను ఆదుకుంటుందని కూడా ఇలా బంగారం పెడుతుంటారు. పిల్లల నామకరణోత్సవ సందర్భంగా... ముందుగా బంగారు ఆభరణంతోటే బియ్యంలో పేరు రాయిస్తారు. అక్షరాభ్యాస సమయంలోనూ, అన్నప్రాసన అప్పుడూ ఇంతే. అయితే బంగారాన్ని కాళ్లకు మాత్రం పెట్టుకోకూడదంటారు. మెట్లు, పట్టీలు వంటివి వెండితో చేసినవే వాడతారు. ఎవరైనా చనిపోయినప్పుడు మాత్రం తమలపాకుల్లో చిన్నం బంగారం చుట్టి మరీ నోట్లో పెట్టి దహన సంస్కారాలు చేస్తుంటారు కొందరు.

కథల్లో...సినిమాల్లో ...బంగారం

సాహిత్యంలో కూడా పుత్తడి స్థానం పుత్తడిదే. బంగారం చుట్టూ తిరిగే కథలు ఎన్నో. ఈ జాబితాకు చెందిన బాలల కథలు కూడా ఎక్కువే. 'పిల్లవాడు-చీమ' కథలో పిల్లవాడు ఏడుస్తుంటాడు. ఎందుకేడుస్తున్నావంటే చీమ కుట్టిందంటాడు. ఎందుకు కుట్టావని చీమనడిగితే 'ఆ.. నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా' అంటుంది గడుసుగా. 'బ్రాహ్మణుడు-పులి' కథ కూడా బంగారు కడియం చుట్టూనే తిరుగుతుంది. 'కట్టెలు కొట్టేవాడు-బంగారు గొడ్డలి' కథా అంతే. బంగారు గుడ్డు పెట్టే బాతు కథ తెలియనిదెవరికి?! ఏది ముట్టుకున్నా బంగారం కావాలని వరం కోరుకున్న రాజు తర్వాత ఎన్ని ఇబ్బందులు పడతాడో చదువుతుంటే నవ్వొస్తుంది. తినబోయిన అన్నం, తాగబోయిన నీళ్లు... కోయబోయిన పువ్వు, ముద్దు చేయబోయిన కుమార్తె...అంతా బంగారంగా మారిపోతారు. అప్పుడా రాజు ఆకలికి తాళలేక ఆ వరం వద్దనుకోవడం చూస్తుంటే ... ఎవరికైనా మరీ అంత అత్యాశ పనికిరాదనిపిస్తుంది. ఓ పక్షి గుడ్లు పెట్టిన ప్రతిసారీ ఒక నాగుబాము వచ్చి వాటిని ఆరగిస్తుంటుంది. పాము పీడ విరగడ చేసుకోవడానికి పక్షి చక్కటి ఉపాయం ఆలోచిస్తుంది. ఆ పక్కనే వున్న చెరువులో స్నానం చేయడానికి వచ్చే రాకుమార్తె నగ ఒకటి తీసి పాము పుట్టలో వేస్తుంది. అది చూచిన భటులు పుట్టను నేలమట్టం చేసి నగ తీసుకుంటారు. పనిలోపనిగా పుట్టలో వున్న పామును కూడా అంతం చేస్తారు. అంతెందుకు రామాయణం జరగడానికిగల ప్రధాన కారణాలలో ఒకటి బంగారు లేడే కదా! బంగారు సీతను పక్కన పెట్టుకొని రాముడు వ్రతం చేయడాన్ని మర్చిపోతేకదా. ఒంటిమీద నూలుపోగు కనిపించని వేమన సైతం లోహాలు, ఆకు పసర నుంచి పుత్తడిని తయారుచేయించేందుకు విఫలయత్నంచేశాడని చెప్తారు. ఇవేనా! బంగారం నిధి చుట్టూ తిరిగే సినిమా కథలు ఎన్నో. ఈ నగలు కన్పించకుండా పోవడంతో వచ్చే మనస్పర్థలు ఎన్నో. సినీ పాటల సాహిత్యంలోనూ బంగారానికి మంచి స్థానమే వుంది. ఇంక సినిమా పేర్ల సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదుకదా. 'బంగారు పాప, మా ఆయన బంగారం, బామ్మమాట బంగారుబాట, కొత్త బంగారు లోకం...' ఇలా ఎన్నో.

ఎన్ని ముద్దు పేర్లో...ఎన్ని పోలికలలో...

పెళ్లిళ్లు కుదుర్చుకునేటప్పుడు ...పిల్ల అందంగా వుంటే ఏమని చెప్తారు? 'పుత్తడి బొమ్మలాగుంది' అనేకదా. భర్తల మంచితనాన్ని భార్యలు ఎలా చెప్తారు? 'మా ఆయన బంగారం' అనే కదా. మారాం చేసే పిల్లలను దారిలోకి తెచ్చుకోడానికి తల్లులు ఏమంటారు? 'మా బాబు బంగారు కొండ' అనే. అంతేనా! ఒరే బంగారం...అరే బంగారం...నా బంగారు తల్లి...నా బంగారు తండ్రి...అని ఎన్ని రకాలుగా పిల్చుకుంటామో. ఏదైనా అవకాశం వస్తే... బంగారం లాంటి అవకాశం వదులుకోవద్దని చెప్తుంటారు. ఈ పిలుపులు, పోలికలన్నిల్లోనూ బంగారం పట్ల మనకు గల ఇష్టం, ప్రేమ, మోజు అన్నీ వ్యక్తమవుతుంటాయి. ఎంతైనా బంగారం కదా!! ★

కథా నిలయం

ఆరోగ్యం

హెపటైటిస్ ఎందుకొస్తుంది?



ఆమెకు పదిహేడేళ్లు. పొట్టలో నీళ్లు చేరుకున్నాయి. అన్ని పరీక్షలు చేస్తే కాలేయం దెబ్బతిన్నది. అప్పటి వరకు కాలేయ వ్యాధికి సంబంధించిన ఎలాంటి లక్షణం ఆ అమ్మాయిలో కనిపించలేదు. ఇది ఆటోఇమ్యూన్ హెపటైటిస్ అని నిర్ధారించారు.

ఓ పాఠశాల విద్యార్థులను యాజమాన్యం విహార యాత్రకు తీసుకెళ్లింది. అక్కడ అందరూ భోజనం చేశారు. చూడ్డానికి బాగానే వున్నారు. ఎలాంటి లక్షణాలు లేవు. అందులో పది మందికి మాత్రమే కామెర్లు వచ్చాయి. నీళ్లు, ఆహారం కలుషితమవ్వడం వల్లే కామెర్లు వచ్చాయని వైద్య పరీక్షల ద్వారా నిర్ధారించారు.

డాక్టర్ ఎంజి జయన్,
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
మెడిసిటీ హాస్పిటల్,
హైదరాబాద్.
ఫోన్ : 9000177708

హెపటైటిస్ అంటే కాలేయాన్ని దెబ్బతీసే జబ్బు. ఇన్‌ఫ్లమేషన్ ఆఫ్ లివర్ అంటే...కాలేయంలో మంట/వాపు. దీన్లోని కణాలు దెబ్బతినడం. హెప అంటే లివర్. టైటిస్ అంటే ఇన్‌ఫ్లమేషన్. హెపటైటిస్-ఎ, ఇ, బి, సి... వరకు వున్నాయి. అయితే ఇందులో మొదటి నాలుగు వ్యాధులే ప్రధానంగా వస్తాయి. ఎ,ఇ వైరస్‌లు కలుషితమైన నీరు, ఆహారం ద్వారా వ్యాపిస్తాయి. సిరంజీలు, అరక్షిత లైంగిక చర్యలు, కలుషితమైన రక్తమార్పిడి ద్వారా హెపటైటిస్-బి, సి వస్తాయి. వేసవిలో నీటి వనరులు కలుషితమవుతాయి. ఆ నీళ్లు తాగిన వారికి హెపటైటిస్-ఎ,ఇ వస్తాయి. నీళ్లలోని వైరస్‌లు పేగుల ద్వారా కాలేయానికి చేరుకుంటాయి. దీంతో కాలేయం దెబ్బతింటుంది. ప్రోడ్రోమల్ ఫేజ్ అంటే కామెర్లు వుండవు. కేవలం జ్వరం, ఒళ్లు నొప్పులు వుంటాయి. ఆకలి వుండదు. రుచి తెలీదు. ఇవి వారం రెండు వారాలుంటాయి. తర్వాత అకస్మాత్తుగా కళ్లు పచ్చబడతాయి. కళ్లు పచ్చగా మారి కామెర్లు వచ్చినప్పుడు రోగి కోలుకుంటాడు. ఆకలి పెరుగుతుంది. మూడు నుంచి నాలుగు వారాల వరకు కామెర్లు వాటంతటవే మెల్లగా తగ్గుతాయి. హెపటైటిస్-ఎ, ఇ వాటంతటవే తగ్గుతాయి. ఇది తెలియని వాళ్లు నాటు వైద్యం, పసరు పోయించుకోవడం, చేతిపై కాల్చడం చేస్తారు. దీంతో కాలేయం మరింత దెబ్బతింటుంది. కొన్నిసార్లు రోగి మరణించే అవకాశం కూడా వుంది. ఇలాంటి అపోహలు పెట్టుకోకుండా దగ్గర్లోని వైద్యుణ్ణి సంప్రదించాలి. చిన్న మందులతోనే నివారించొచ్చు. హెపటైటిస్ వచ్చినప్పుడు ఆరు వారాల పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. నూనె వస్తువులు తీసుకోకూడదు. మాంసాహారం మానెయ్యాలి. దీనివల్ల కొంత నయమవుతుంది. కొంతమందిలో కాలేయం పనిచేయకుండా రక్తస్రావం అవుతుంది. ముఖం, కాళ్లు ఉబ్బుతాయి. పొట్టలో నీళ్లు వచ్చి పరిస్థితి తీవ్రమయ్యే అవకాశముంది. అయితే ఇలా జరగడం చాలా అరుదు. హెపటైటిస్-బి వైరస్ రెండు రకాలు. హెపటైటిస్ వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత హెపటైటిస్-బి రావడానికి ఒకటి నుంచి ఆరు నెలలు పడుతుంది. ఆ తర్వాత కామెర్లు వస్తాయి. రోగి నీరసంగా వుంటాడు. మూడు నెలల్లో నయం అవుతుంది. అక్యూట్ హెపటైటిస్-బికి ఎలాంటి చికిత్స అవసరం లేదు. దానంతటదే తగ్గుతుంది. క్రానిక్ హెపటైటిస్-బికి చికిత్స అవసరం. కాలేయం దెబ్బతిన్నదాన్ని బట్టి మందులు లేదా ఇంజక్షన్లతో చికిత్స చేస్తారు. హెపటైటిస్-సి కలుషిత రక్తం, ఇంజక్షన్ల ద్వారా వస్తుంది. వైరస్ ఒక సారి శరీరంలోకి ప్రవేశిస్తే 10 నుంచి 20 ఏళ్ల వరకు శరీరంలో దాగి వుంటుంది. 30 ఏళ్ల తర్వాత కాలేయ వ్యాధి వస్తుంది. హెపటైటిస్-బి కన్నా హెపటైటిస్-సికి చికిత్స చేయడం కష్టం.

ఆటోఇమ్యూన్ హెపటైటిస్

ఎలాంటి కారణం లేకుండా శరీరంలోని రోగనిరోధక కణాలు కాలేయంపై దాడి చేయడం వల్ల ఆటో ఇమ్యూన్ హెపటైటిస్ వస్తుంది. ఎలాంటి లక్షణాలు లేకుండానే ఇది కలుగుతుంది. కాలేయ కణాలు దెబ్బతిని లివర్ సిర్రోసిస్ వస్తుంది. నిశ్శబ్దంగా కాలేయం దెబ్బతింటుంది.

డ్రగ్ ఇన్‌డ్యూస్డ్ హెపటైటిస్

కొన్ని మందులు వాడడం వల్ల కూడా హెపటైటిస్ వచ్చే అవకాశాలున్నాయి. దీని వల్ల కాలేయం దెబ్బతింటుంది.

లివర్ ఫెయిల్యూర్

ఏ హెపటైటిస్‌లోనైనా లివర్ ఫెయిల్యూర్ అవడాన్ని తీవ్ర పరిస్థితిగా పరిగణించొచ్చు. కాలేయం పనిచేయకపోతే రక్తం గడ్డకట్టదు. రక్తం గడ్డకట్టకపోతే చిన్న గాయమైనా తీవ్ర రక్తస్రావమవుతుంది. ముఖం, కాళ్లు, కడుపు ఉబ్బడం, కోమాలోకి వెళ్లిపోవడం లివర్ ఫెయిల్యూర్‌కు లక్షణాలు.

ఆల్కహాలిక్ హెపటైటిస్

వైరస్ వల్లేకాక మద్యం సేవించడం వల్ల కూడా కాలేయం దెబ్బతింటుంది. దీంతో కామెర్లు వస్తాయి. ఇలాంటి పరిస్థితిలో నాటు వైద్యం, పసరు వేయించుకుంటే కాలేయం మరింత దెబ్బతింటుంది.

లక్షణాలు

ఆకలి కాకపోవడం, నీరసంగా వుండడం, కామెర్లు వచ్చినప్పుడు కళ్లు పచ్చగా అవుతాయి. మూత్రం పచ్చగా వస్తుంది. కాలేయం నాళాలు మూసుకుపోతాయి. ఈ పసరు రక్తంలో కలిసి కళ్లు పచ్చగా మారతాయి. మలం పచ్చగా కాకుండా తెల్లగా వస్తుంది.

వ్యాక్సిన్లు

ప్రస్తుతం హెపటైటిస్-ఎ,బిలకు వ్యాక్సిన్లు అందుబాటులో వున్నాయి. జాతీయ టీకాల కార్యక్రమంలో పుట్టుకతోనే హెపటైటిస్-ఎ వ్యాక్సిన్లు శిశువులకిస్తున్నారు. హెపటైటిస్-సి,ఇ వైరస్‌లకు వ్యాక్సిన్ లేదు. దీన్ని కనుక్కోవడానికి పరిశోధనలు జరుగుతున్నాయి.

జాగ్రత్తలు

హెపటైటిస్-ఎ, ఇ రాకుండా జాగ్రత్తపడాలి. ఎక్కడంటే అక్కడ ఆహారం, నీళ్లు తీసుకోకూడదు. శుభ్రమైన వాతావరణంలో తయారైన ఆహారాన్ని తీసుకోవాలి. వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు నాణ్యమైన మినరల్ నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిది. హెపటైటిస్-బి,సిలకు... ఇంజక్షన్లు తీసుకునేటప్పుడు డిస్పోజబుల్ సిరంజీలు వాడడం మంచిది. రక్తం మార్పిడి చేసేటప్పుడు రక్తపరీక్ష తప్పనిసరిగా చేయాలి. అరక్షిత లైంగిక చర్యల్లో పాల్గొనకూడదు. ★

ఓ మంచి పుస్తకం



చరిత్రకు సజీవ చిత్రణం రాజకీయ పాఠాల దర్పణం

ఆ తర్వాత ఉద్యమంక్రమంలో సమిష్టి అవగాహన పెరిగే కొద్దీ అందరి అభిప్రాయాలు ఒకటిగా తయారయిన తీరును ఇ.ఎం.ఎస్. నొక్కి చెప్పారు. మార్క్సిస్టు పార్టీ చేపట్టిన జనతా ప్రజాస్వామిక, శ్రామికవర్గ అంతర్జాతీయతా పంథా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేసి ఈనాడున్న స్థితికి యెలా పెరిగిందో ఆయన క్లుప్తమైన, సుస్పష్టమైన రీతిలో పాఠకులకు వివరించారు.

-తె.ర

గడచిపోయిన చారిత్రక పరిణామాలను, అందులోనూ రాజకీయ పరిణామాలను సరైన దృక్పథంతో అవలోకించడం, అవగాహన చేసుకోవడం అంత తేలిక కాదు. ఆ పరిణామాలను ప్రత్యక్షంగా చూసిన సమకాలీనులే వాటిని శాస్త్రీయంగా విశ్లేషించడం కష్టం. ఇక తర్వాతి తరాలకు చెందినవారు వాటి గురించి సవ్యంగా తెలుసుకోవాలంటే వివరించేవారికి విషయ పరిజ్ఞానం మాత్రమే గాక ఆసక్తికరంగా చెప్పగల నైపుణ్యం కూడా వుండాలి. ఇ.ఎం. ఎస్ నంబూద్రిపాద్ రచన 'ఓ కమ్యూనిస్టు జ్ఞాపకాలు' అన్నివిధాలా అలాంటి ఆసక్తికరమైన గ్రంథం. భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకుడుగా, కేరళ ముఖ్యమంత్రిగా బహు విషయ గ్రంథకర్తగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా అందరికీ అనేక విధాల సుపరిచితుడైన వ్యక్తి నంబూద్రిపాద్. ఆయన జ్ఞాపకాలు కేవలం వ్యక్తిగత స్మృతులు కాదు, అలా అని అచ్చంగా రాజకీయ సూత్రీకరణలు, ఉటంకింపులతో నిండినవీ కావు. ఈ రెండింటి కలబోతగా ఒక విలక్షణ శైలిలో నడచిన గ్రంథమిది. ప్రజాశక్తిలో ధారావాహికంగా వెలువడినప్పుడే ఈ జ్ఞాపకాలు అందరినీ ఆకర్షించాయి. పెద్దవాళ్ళలో నాటి ఘటనల జ్ఞాపకాల అలలు కదిలించాయి. పిన్నవారికీ గతాన్ని విశ్లేషణాత్మకంగా, సుబోధకంగా ఎరుక పరిచాయి. అందుకే అది నడిచినన్నాళ్ళు పాఠకుల ప్రశంసాలేఖలు పుంఖాను పుంఖాలుగా వచ్చాయి. కమ్యూనిస్టులేగాక రాజకీయాలు అధ్యయనం చేసే వారెవరైనా ఆవశ్యం దగ్గరుంచుకోవలసిన అమూల్య గ్రంథమిది. ఈ పుస్తకంలో వున్నవి పేజీలే అయినా అందులో అనేక దశాబ్దాల చరిత్రగతిని ఇ.ఎం.ఎస్. పాఠకుడి కళ్ల ముందుంచుతారు.

భారతకమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో కీలకపాత్రధారిగా వుంటూనే ఎన్నెన్నో సమస్యలపై విలువైన రచనలు చేసిన వ్యక్తి ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, కేరళ సాంఘిక, రాజకీయ చరిత్ర గురించి కమ్యూనిస్టు పార్టీ పుట్టుక - పెరుగదల గురించి మళయాళంలో ఇంగ్లీషులో ఎన్నో పుస్తకాలు రాశారు. నేను కమ్యూనిస్టు ఎలా అయ్యాను? అన్న ఆయన ఆత్మకథ మొదటి భాగం ఇప్పటికి తెలుగులో రెండు ముద్రణలు పొందింది. అయితే ఆ రచనల్లో కేరళకు సంబంధించిన విషయాలు ఎక్కువగా ఉన్నాయి. గనుక ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి అవసరమైన మేరకు వాటిని కుదించి ఈ పుస్తకం రూపొందించారు.

అత్యంత సనాతనమైన నంబూద్రి కుటుంబంలో పుట్టి, శ్రామికవర్గ పార్టీకి నాయకుడైన వ్యక్తి నంబూద్రిపాద్. ఆనాడు తమను బంధించిన మూఢ విశ్వాసాలు, కట్టుబాట్ల గురించి ఆయన చక్కగా తెలియజేశారు. తాను శ్రామికవర్గానికి దత్తపుత్రుడని సవినయంగా ప్రకటించుకోగలిగారు. విద్యార్థి దశలో జాతీయోద్యమ ప్రభావం, నాటి తన ఆలోచనా క్రమం చెప్పారు. విద్యార్థి దశలో ఒకసారి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొందామనకొని కూడా చివర్లో భయంతో జంకానని, తర్వాత ఉప్పుసత్యాగ్రహం వచ్చేసరికి దృఢనిశ్చయంతో పాల్గొన్నానని నిస్సంకోచంగా వెల్లడించారు. ఆ సందర్భంగా గాంధీజీని, జాతీయోద్యమాన్ని గురించి వారి పరిమితుల గురించి తర్వాత శాస్త్రీయమైన రీతిలో విశ్లేషించారు.

విద్యార్థి జీవితస్మృతిలో తన గురువుల గురించి, ఇంటి విషయాలు చెప్పేటప్పుడు అమ్మ గురించి ఆర్ద్రతతో ఆయన వివరించిన తీరు కళ్ళు చెమరింపచేస్తుంది. మానవతా పరిమళం గుబాళిస్తుంది. అలాగే తన జీవిత భాగస్వామి గురించి కూడా. విశేషమేమంటే వీరెవరి గురించి కూడా మరి ఎక్కువ రాసి వ్యక్తిగత సెంటిమెంట్లతో నింపే పని ఆయన పెట్టుకోలేదు. అయినా రాసిన రెండు ముక్కలూ ఎంతో శక్తివంతంగా వున్నాయి. సామాజిక, రాజకీయ సమస్యలు అధ్యయనానికి ఆయన చూపిన ప్రశంసనీయమైన శ్రద్ధ మనకీ పుస్తకంలో గోచరిస్తుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కౌలుదార్ల సమస్యగాని, కేరళ రాష్ట్ర ఆవిర్భావానికి పునాదులు వేసిన రచనగాని, రిజర్వేషన్ల సమస్యగాని ఏది తీసుకున్నా ఆయన లోతుగా అధ్యయనం చేశారు. అందులోగల మంచి చెడ్డలను ఈనాటికీ పరిశీలించుకుంటూనే వున్న నిరంతరాధ్యయనశీలత మనలను ముగ్ధులను చేస్తుంది.

కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన భేదాభిప్రాయాలు, వాటికి కారణాలను ఆయన నిరావేశంగానూ, సునిశితంగానూ వివరించారు. అవి చదివిన నాటితరం వారికి గతం ఫిలింరీలులా కళ్లముందు కదలకమానదు. ఇ.ఎం.ఎస్. రచనలో మరో ప్రత్యేకమయిన విశేషముంది. కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాలు వచ్చిన మొదటి రోజుల్లో ఆయన సుందరయ్య, బసవపున్నయ్య ప్రభృతులతో పూర్తిగా ఏకీభవించలేదు. అయితే మితవాదుల పట్ల గట్టి వ్యతిరేకత వుండేది. అందుకే తన ప్రత్యేకాభిప్రాయాలు చెబుతూనే మార్క్సిస్టు పార్టీ వైపు వచ్చారు. ఆ తర్వాత ఉద్యమంక్రమంలో సమిష్టి అవగాహన పెరిగే కొద్దీ అందరి అభిప్రాయాలు ఒకటిగా తయారయిన తీరును ఇ.ఎం.ఎస్. నొక్కి చెప్పారు. మార్క్సిస్టు పార్టీ చేపట్టిన జనతా ప్రజాస్వామిక, శ్రామికవర్గ అంతర్జాతీయతా పంథా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేసి ఈనాడున్న స్థితికి యెలా పెరిగిందో ఆయన క్లుప్తమైన, సుస్పష్టమైన రీతిలో పాఠకులకు వివరించారు. ప్రజా పోరాటాలలోనూ, పార్లమెంటులోనూ కూడా కామ్రేడ్ సుందరయ్య, కామ్రేడ్ ఎ.కె. గోపాలన్ వ్యవహరించిన పద్ధతి ప్రత్యేకంగా ఒక అధ్యాయం రాశారు.

ఇక చివరిగా - ఉమ్మడి పార్టీలోనూ- తర్వాత మార్క్సిస్టు పార్టీలోనూ ఈనాటి వరకూ వివిధ దశల్లో జరిగిన అంతరంగిక పోరాటాలను, పర్యావసానాలను పేర్కొని సరైన సిద్ధాంత రాజకీయ పంథా ప్రాతిపదికగా సమిష్టి పని చేయాలన్న గుణపాఠాన్ని నొక్కిచెప్పారు. నిజంగా ఈ అధ్యాయం పుస్తకం చివరిలో వున్నప్పటికీ అమూల్యమైనది. కాకలుతీరిన ఒక కమ్యూనిస్టు నాయకుడు, ఆర్ద్రత నిండిన మానవతావాది గ్రంథస్థం చేసిన ఈ స్మృతులు చదవటం ద్వారా ఎన్నో పుస్తకాలు చదివిన, ఎన్నో దశాబ్దాల చరిత్రను ఒకేసారి సింహావలోకనం చేసిన అనుభూతి కలుగుతుంది అనడం అతిశయోక్తి కాదు.

★

విజ్ఞాన వీచిక

అంతరిక్షంలో ప్రమాదం



- డా॥ కాకర్లమూడి విజయ్

అంతరిక్షంలో అసంఖ్యాకమైన అనవసర, కృతిమ శకలాలు పరిభ్రమిస్తూ ఉన్నాయనీ వాటితో ఏనాటికైనా ప్రమాదమేనని ఇంతకు పూర్వం విజ్ఞానవీచికలో ప్రస్తావించుకున్నాం. ఈమధ్యే అటువంటి ఒక ప్రమాదం జరగనే జరిగింది. అంతరిక్షంలో మొట్టమొదటి అనదగ్గ ఒక సంఘటన సంభవించింది. రెండు పూర్తిస్థాయి కృతిమ ఉపగ్రహాలు ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి. వాటిలో ఒకటి అమెరికాకు చెందిన ఇరిడియమ్ ఉపగ్రహం. అది 1997లో రోదసిలో ప్రవేశించింది. అది ప్రమాదం ముందువరకూ పనిచేస్తూనే వుంది. మరొక ఉపగ్రహం రష్యాకు చెందిన కాస్మోస్ 2251. అది పనిచేయడం మానివేసిన ఉపగ్రహం. కాస్మోస్ 1993లో ప్రయోగించబడింది. కానీ ఆ తరువాత రెండేళ్లకు పనిచేయడం మానివేసింది. ఆ రెండు ఉపగ్రహలూ సైబీరియా ప్రాంతం పైన 789 కిమీ ఎత్తులో ఢీకొన్నాయి. ఆ సమయంలో అవి సెకనుకు 117 కిమీ వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఆ ప్రమాదంలో రెండు ఉపగ్రహాలూ పూర్తిగా ధ్వంసమైపోయాయి. గతంలో నాలుగు సార్లు ఇటువంటి అంతరిక్ష ప్రమాదాలు జరిగాయి. అయితే అవి శకలాల మధ్య చిన్న ఉపగ్రహాల మధ్యనే కానీ తాజాగా జరిగినంత పెద్ద ఉపగ్రహాల మధ్య కాదు.

ప్రమాద కారణంగా ఉత్పన్నమైన శకలాలతో మరింత ప్రమాదం పొంచి వుందని అంతరిక్ష నిపుణులు అంటున్నారు. ఇప్పటివరకూ దాదాపు 500 శకలాలను పసిగట్టి వాటి కదలికలను గమనిస్తున్నారు. మరిన్ని వందల శకలాలు ఇంకా దొరకవలసి (టెలిస్కోపులో) వుంది.

ఈ సంవత్సర ప్రారంభపు అంచనాల ప్రకారం దాదాపు 17వేల కృత్రిమ శకలాలు భూమి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాయి. వాటిలో కనీసం నాలుగంగుళాల స్థాయి శకలాలను అమెరికా సైనిక సంస్థ గమనిస్తోంది.

సాధారణంగా వందల ఉపగ్రహాలు కొన్ని సంవత్సరాల నుండీ అంతరిక్షంలో పరిభ్రమిస్తున్నా ఇటువంటి ప్రమాదాలు అరుదు. కారణం ఆ ఉపగ్రహాలు చాలా ఎత్తులో మరో ఉపగ్రహానికి ఇబ్బంది కలగని వేగంతో వెళ్తుంటాయి. కానీ ప్రమాదానికి కారణమైన ఇరిడియమ్ ఉపగ్రహం కథ వేరు.

ఇరిడియమ్ ఉపగ్రహాలు సమచార ప్రసారం కోసం వాడబడుతున్నాయి. శాటిలైట్ ఫోన్లు పనిచేయడానికి ఇవి ఉపకరిస్తాయి. ఇరిడియమ్ సంస్థకి దాదాపు మూడు లక్షల వినియోగదార్లున్నారు. వాటిలో అమెరికా రక్షణ సంస్థ పెద్ద కస్టమరు. ఇప్పటికి 65 ఉపగ్రహాలను ఇరిడియమ్ సంస్థ అంతరిక్షంలో ప్రవేశపెట్టింది. మోటరోలా కంపెనీ ద్వారా 1990లలో ప్రారంభమైన ఇరిడియమ్ సంస్థ 1990 కల్లా దివాళా తీసింది. దాంతో ప్రైవేటు పెట్టుబడిదార్లు దానిని 2001 లో పునః ప్రారంభించారు. ఈ ఉపగ్రహాలు తక్కువ ఎత్తులో ఎక్కువ వేగంతో తిరుగుతాయి.అయిదువందల అరవై కిలోల ఇరిడియమ్-33, టన్ను బరువున్న కాస్మోస్ ఢీకొన్నపుడు రెండు పొగమేఘాలు ఆవిర్భవించాయని అమెరికా నిఘా విభాగం తెలిపింది. ప్రమాదం జరిగిన రెండు రోజుల తరువాత కెంటకీ ప్రాంతంలో సోనిక్ బూమ్ అనే ధ్వనులు వినిపించాయి. శకలాల ధాటికి భూకంపాలూ, విమాన ప్రమాదాలూ, విస్ఫోటాలూ జరగవచ్చున్న హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. అయితే అవన్నీ నిరాధారమని తర్వాత తేలాయి.

ఈ ప్రమాదంలో ఏర్పడ్డ శకలాలు భూమి చుట్టూ దాదాపు పదివేల సంవత్సరాల వరకూ కక్ష్యలో తిరుగుతూ ఇతర ఉపగ్రహాలకు ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ప్రమాదం జరిగిన ఎత్తుకన్నా 270 మైళ్ల కింద అంతర్జాతీయ రోదసి సేష్టన్ (స్పేస్ స్టేషన్) వుంది. దానికి గానీ, ఈ నెలలో ప్రయోగించబడే స్పేస్ షటిల్ కి గానీ శకలాల వల్ల ప్రమాదం తక్కువేనని పరిశీలకులు భావిస్తున్నారు. అనడం కంటే ఆశిస్తున్నారు అనడం సబబేమో! గంటకి 42,000 కిమీ పైగా వేగంతో ప్రయాణిస్తున్న అతి చిన్న శకలాలైనా సరే వేగంగా ప్రయాణిస్తున్న వస్తువులను తాకితే పర్యవసానం అతి భయంకరంగా వుంటుంది. ఈ నేపథ్యంలో ఇతర ఉపగ్రహాలకూ, స్పేస్ స్టేషన్‌కూ, స్పేస్ షటిళ్లకూ రక్షణ ఏ మాత్రమో ఊహించలేనిది కాదు. కానీ అటువంటి ఆందోళన అనవసరమంటున్నారు నిపుణులు!

★

ముదురు



ప్రేమా లేదు దోమా లేదు. నడువ్ ఇంటికి.

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి
గుమ్మడి పండు
వీరి పేరు
కాస్ట్రో



క్రైమ్ కథ

అనాథసాక్ష్యం

- యర్నాగుల సుధాకరరావు

రోడ్డుమీద బిచ్చమెత్తుకునే ఒకామెను తీసుకొచ్చి కోర్టుబోనులో సాక్ష్యంగా నిలబెట్టారు పోలీసులు. హంతకుడు జాన్ తరుపున వాదించే లాయర్ పెద్దఎత్తున అబ్జక్ట్ చేస్తూ పోలీసులు కావాలనే బిచ్చమెత్తుకునే ఒక అనాథను భయపెట్టి సాక్ష్యం చెప్పించేందుకు తీసుకువచ్చారని రెండు రోజులుగా ఆమెను పోలీస్‌ఠాణాలో పెట్టి నిర్బంధించారని తెలిపాడు.

అక్కడే ఉన్న పోలీసు అధికారిని జడ్జి ప్రశ్నించగా "మిలార్డు జాన్ చంపుతుండగా చూసిన ఏకైక సాక్ష్యం ఈమె, హతుడు శేర్ రాంకీ ఈమెకు ప్రతి శుక్రవారం ఒకహోటల్ మీల్సు టిక్కెట్లు వారానికి సరిపడా ఇస్తుంటాడు. వాటి కోసం ఈమె వెళ్లగా జాన్ అప్పుడే అక్కడికి వచ్చి ఈమెను పక్కకు నెట్టేసి మరీ చాలా దగ్గర నుంచి నాలుగుసార్లు పిస్తోలుతో కాల్చిచంపాడు. ఈమె ప్రత్యక్షసాక్షి. అయితే జాన్ తరుపు లాయర్‌గారి వాదనలో నిజంలేదు. అది కేవలం ఊహ మాత్రమే. ఈకేసులో మాకు ప్రత్యక్షసాక్షి ఎవరూ దొరక లేదు.చంపింది జాన్ అని కమర్షియల్ కాంప్లెక్సులోంచి అతడు బయటికి వచ్చినపుడు చూసిన వారున్నారు. చంపేటపుడు ఉన్న ఏకైకసాక్షి ఈమె" వివరించాడు.

బోనులో నిలబడున్న ఆమెను చూసి జడ్జి "నీపేరు? నీదే ఊరు? నీకు ఎందుకు మీల్సు టిక్కెట్లు ప్రతివారం ఇస్తుంటాడు?" అని ప్రశ్నించాడు.

"అయ్యా! నాకు ఊరంటూలేదు. నేను యాచకురాలిని, చిన్నతనంలో కొద్దిగా చదువుకున్నాను. అన్నిమతాల పుస్తకాలు కొద్దోగొప్పో చదివాను. అయితే ఏసుప్రభువు కతలు నాకు ఉచితంగా ఇస్తే చదివాను.అవి చదివి బోధనలు చేస్తుండేదాన్ని. ఒకసారి చంపబడిన శేర్ గుడిమెట్టుమీద నేను చెబుతుంటే నాచుట్టూచేరిన తోటియాచకులను చూసి 'నువ్వు చదువుకున్నావా? చాలా బాగా చెబుతున్నావు' అని మెచ్చుకుని నాకు పదిరూపాయలు ఇచ్చారు. అలా ఒకసారి ఇప్పుడు చంపబడిన శేర్ బంగారం షాపు వద్దకు వెడితే అతనే గుర్తుపట్టి నాకు వారానికి సరిపడా ఒకహోటల్ టిక్కెట్లు ఇచ్చాడు. ప్రతివారం రమ్మనే వాడు. అలా వెడుతుండేదాన్ని. అతడెలాంటివాడో నాకుతెలియదు. చాలామంది యాచకులకు మీల్సు టిక్కెట్లు ఇచ్చేవాడు. అన్నదానం చేస్తే పుణ్యమని నమ్మేవాడు. ఒకరోజు ఆషాపువద్ద ఎవరూలేరు. ఆబోనులో నిలబడున్న జాన్ వచ్చి "నీకు మూడిందిరా శేర్" అని నల్లని పిస్తోలుతో కాల్చేశాడు. నాకళ్లముందే అన్నదాత శేర్ మరణించాడు. జాన్ నన్ను చూసి 'ఏయ్ ముసలీ! ఎక్కడైనా చూశానని వాగావో వెతికి వెతికి నిన్ను చంపేస్తాను' అని హెచ్చరించి వెళ్లిపోయాడు" మొత్తం కథనం అంతా వివరించింది.

"శేర్ చంపబడినరోజే ఎందుకు నీవు పోలీసులకు చెప్పలేదు?"

"ఆ ఖూనీ చూశాక చాలాకాలం వరకు మనిషిని కాలేకపోయాను. ఈలోగా నన్ను వెతుక్కుంటూ గూండాలు వచ్చి పదేపదే హెచ్చరించారు. వారు అలా హెచ్చరించకపోయిఉంటే నేను ఈరోజు ఈకోర్టు బోనులో నిలబడే దాన్ని కాను. ఎక్కడా నోరువిప్పేదాన్నికాదు"

"అదెలా? ఆగూండాల్లో ఒకరిద్దరు నిన్ను పోలీసులకు చెప్పమన్నారా?"

"లేదయ్యా! నాకు నిత్యం మీల్సు టిక్కెట్ ఇచ్చే అన్నదాత లేకపోవడంతో పస్తులు ఉండేదాన్ని. నిత్యం గూండాల తాకిడి ఉండేది. నీకళ్లముందు జరిగిన హత్య గురించి పోలీసులకు చెప్పి కోర్టు కొచ్చావో నీచావు నీవుకోరుకున్నట్టే అని కత్తులుచూపి హెచ్చరించేవారు. నిత్యం వారు అలా వేధిస్తుంటే నేను అలా చెబితే ఏమవుతుంది అని వారినే అడిగాను. వారు 'మాబాస్ జాన్‌కు ఉరిపడుతుంది' అని చెప్పారు.అప్పుడు శేర్‌ను చంపినవాడిని వదలకూడదనుకున్నాను. పోలీసులకు చెప్పాలని అనుకున్నాను. మొన్నామధ్య ఒక పోలీసు ఠాణాకు వెళ్లి చెప్పాను. వాళ్లు పూర్తిగా వినకుండా పొమ్మన్నారు. నేను అక్కణ్నించి కదల్లేదు. ఆకేసుకు మాకు సంబంధంలేదు. వేరే స్టేషన్‌వారు పెట్టారన్నారు. నాకు ఇవన్నీ తెలియనందున నన్ను కోర్టుకు తీసుకుపోమని కోరాను. నాకు వయసుడిగిన కారణంగా నేను మతిలేని మాటలు ఆడుతున్నట్టుగా భావించారు. అక్కడ ఆస్టేషన్ ఆరుబయట రెండురోజులు ఉండిపోయాను. నిన్న ఉదయం ఒక కానిస్టేబుల్ నన్ను చూసి జాలిపడి జాన్‌వల్ల చంపబడిన శేర్ కేసు టూ టవున్ పోలీసుస్టేషన్ నుంచి కోర్టుకు వెళ్లింది. అక్కడ నీవు చెబితే సరిపోతుంది అని చెప్పాడు.అప్పుడు అక్కడ నిలబడున్న అధికారిని కలుసుకుని విషయం చెప్పాను.వెంటనే నన్నీ కోర్టులో నిలిపాడు" అని చెప్పింది.

"నిన్ను సాక్ష్యం చెప్పమని పోలీసులు నిర్బంధించారా? లేక నీవే అక్కడ సాక్ష్యం చెప్పేందుకు ఉన్నావా?"

"ముందు నేను వెళ్లిన పోలీసు ఠాణాలోనే రెండురోజులు పడిగాపులు పడ్డాను. ఈరోజు నేను పోలీసులతో వ్యాన్ దిగి వస్తుంటే ఆపోలీసు అధికారి జాన్ లాయర్‌కు నన్ను వేలెట్టి చూపించి మరీ చెప్పాడు. ఈలాయర్ బాబు నన్ను నిర్బంధించారని వేరేగా మీతో ఇప్పుడు చెప్పారు"

లేదయ్యా! నాకు నిత్యం మీల్సు టిక్కెట్ ఇచ్చే అన్నదాత లేకపోవడంతో పస్తులు ఉండేదాన్ని. నిత్యం గూండాల తాకిడి ఉండేది.

జడ్జి ఆమెను తదేకంగా చూశాడు.

"నీవయస్సు డెబ్బయ్ ఉంటాయి. ప్రతి చిన్న విషయం గుర్తుపెట్టుకుని చెబుతున్నావు. ఇక నీవేమి చూశావు ఎవరేమి అన్నారో చెప్పు"

"అయ్యా శేర్! ఈజాన్‌ను చూడగానే నీకు చెప్పినపనికి నేను ఇవ్వవల్సింది ఇచ్చాను.కానీ, నీవు ఎక్కువ ఆశిస్తున్నావు.ఇక నీకు ఇచ్చేదిలేదు. నేను వేరే గూండాతో నాపనులు చేయించుకుంటాను.చేసింది తప్పులయినా అందులో నిజాయితీ ఉండాలి అని అన్నాడు.ఆవెంటనే నీకు మూడిందిరా శేర్ అని పిస్తోలుతో కాల్చేశాడు."

"ఇక నీవు వెళ్లొచ్చు.నీవు చెప్పింది ఈకేసుకు బాగానే తోడ్పడుతుంది"

"అయ్యా ఇలా నేను చెబితే నన్ను చంపుతామని జాన్ మనుష్యులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఒకవేళ ఆపాపిష్టి మనుష్యులు అలా చంపితే క్రైస్తవులు జరిపేట్టు నాశవాన్ని ఖననం చేయాలి.ఇదే నాఆఖరి కోరిక"

ఒక్కసారి కోర్టులో నిశ్శబ్దం చోటుచేసుకుంది.వెంటనే కోర్టులోఉన్న పోలీసులకు ఆమె రక్షణబాధ్యతను అప్పగించాడు జడ్జి.

"అయ్యా యాచకురాలిని నామాటలు వినడానికి పోలీసులు ఇష్టపడ లేదు.వారు నాకోసం నావెంటపడివస్తారా?పెద్దవారని మీకు చెప్పాను.ఇక ఆప్రభువే నారక్షణ చూసుకుంటాడు."చెప్పి బోనులోంచి వెళ్లిపోయింది. బోనులో నిలబడున్న జాన్ ముఖం జేవురించింది.

"నీవేం చెప్పుకుంటావు?"

"ఆమె ఎవరో నాకు తెలియదు.పోలీసులు కావాలని నాపై లేనిపోని ఆరోపణలతో ఆమెను చివరిలో రంగంలోకి దించారు.నేను హత్య చేయలేదు. శేర్ ఎవరో నాకుతెలియదు.కనీసం మాట్లాడి ఎరుగను"

పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కొన్నిఫోటోలు జడ్జి ముందుపెట్టాడు.అందులో శేర్ తో కలిసి జాన్ చాలాఫోటోలలో ఉన్నాడు. "ఈఫోటోల మాటేమిటి? నువ్వు ఏమిచెప్పినా ఇక నమ్మక్కర్లేదు అన్నట్టుగానే అబద్ధాలు చెబుతున్నావు. ఇంత వరకు నీవు బెయిల్‌మీదున్నావు వాయిదాలకు వస్తున్నావు.నీకారణంగా సాక్ష్యం చెప్పిన యాచక ముసలామెకు ప్రాణాపాయం ఉన్నందున నీబెయిల్ డిస్మిస్ చేస్తున్నాను" అని చెప్పి ఆరోజు ఆకేసు వాయిదావేశాడు జడ్జి. ఆతర్వాత జాన్‌కి యావజ్జీవశిక్ష విధించబడింది.

★

తెలుగు తెరకు ప్రాణం పోసిన నాయికలు

తెలుగు సినిమాలో వచ్చిన మార్పులన్నిటిలోకి అతి ప్రధానమైంది, బాధాకరమైంది మహిళా పాత్రల ప్రాధాన్యత తగ్గడం. నాయికలను గౌరవంగా శక్తివంతంగా గాక కేవలం అలంకార ప్రాయంగా శృంగార సాధనాలుగా చూపించడం. ఎంత పేద్ద పేరు గల తారామణి నటించినా ఎంత భారీ పారితోషికం అందినా కథలో ప్రాధాన్యత మాత్రం వుండదు. హీరోగారు వీరోచిత కృత్యాలతో చెలరేగి పోతుంటే అతగాని చుట్టూ అదేపనిగా వెంటపడటం లేదా కలలుకనడం అతని కలల్లోకి తొంగిచూడటం తప్ప నాయికలకు పనే వుండదు. ఒకరికి ఇద్దరు ముగ్గురు నాయికలను ఇందుకోసమే తీసుకోవడంతో ఆగక ఆపైన ఐటెం సాంగ్స్ పేరిట మరింత మందిని రంగంలోకి దింపుతుంటారు. ఎంత పెద్ద హీరో గారైనా నాయిక నడుంపైన చేయి వేయడమే ఘనకార్యమైనట్టు పోస్టర్ ఫోజులిస్తాడు. అతని చుట్టూ మరో నలుగురు అమ్మాయిలు మూగి వుంటారు. వాట్ ఏ ఫాల్ మై డియర్ అని షేక్స్పియర్ అన్న మాటలను ఇవెప్పుడూ గుర్తుచేస్తుంటాయి.

- తె.ర

సినిమా రంగం హీరోల చుట్టూ తిరగడం వున్నా హీరోయిన్లను కేవలం బొమ్మల కింద మార్చడం మాత్రం ఇటీవలి పరిణామమే. వాస్తవంలో మొదటి తరంలో హీరోల కన్నా హీరోయిన్లే ప్రాబల్యం వహించిన పరిస్థితి చూస్తాం. కాంచనమాల వంటి నాయికలు అప్పట్లోనే ఒక వెలుగు వెలిగారు. తర్వాత కాలంలో కన్నాంబ, శాంతకుమారి వంటి వారి భర్తలే పెద్ద దర్శక నిర్మాతలు గనక వారిని పక్కకు నెట్టడం జరగలేదు. నాగయ్యను మినహాయిస్తే తర్వాత నాయకులందరూ ఏ ఎన్నార్, ఎన్టీఆర్‌లతో సహా వీరి ద్వారా వచ్చిన వారే. మొదట్లో ఒక విధంగా భయభక్తులతో వారి పక్కన నటించేవారు. మరో నటి కన్నాంబ భర్త కడారు నాగభూషణం కూడా దర్శకులే. అటు స్వయం ప్రతిభ వల్లనూ ఇటు కుటుంబ పరమైన బలం వల్లనూ కూడా వారు హీరోలకు దీటుగా నిలవగలిగారు. అనేక సార్లు వారిని మించి పోయారు కూడా. ఇదంతా కళాత్మక దృష్టితో జరిగేదే తప్ప అభిమానుల పేరిట ఆధిక్యత సాగించుకోవడం, అంతా తమ చుట్టే తిప్పుకోవడం వుండేది కాదు. కథను బట్టి చిత్రీకరణ. అంతే.

తర్వాతి కాలంలో భానుమతి ఈ కోవలో చెప్పుకోదగిన వారు. ఇద్దరు అగ్రనటుల కన్నా ముందే ఆమె నాయికగా ప్రసిద్ధి కెక్కారు. ఆ పైన భర్త రామకృష్ణతో కలసి భరణీ స్టూడియో నడుపుతూ స్వయంగా చిత్ర నిర్మాణ సారథ్యం వహించారు. ఏఎన్నార్‌తో 'లైలామజ్నూ' వంటి చిత్రాలు తీశారు. ఎన్టీఆర్‌తో 'మల్లీశ్వరి'లో నటించినప్పటికే ఆమె ప్రసిద్ధ నటి. అందుకే 'వారు నా పక్కన నటించారు గాని నేను వారి పక్కన కాదు' అనగలిగారు. భానుమతి చిత్రాల్లో స్వయంగా పాడుకోవడం, దర్శకనిర్మాణాలలో భాగస్వామ్యం, సంగీత పరిజ్ఞానం వంటివన్నీ ఆమెను హీరోలకు దీటుగా నిలిపాయి. వేర్వేరు దశల్లో తీసిన 'పల్నాటియుద్ధం'లో కన్నాంబ, భానుమతి ఇద్దరూ నాయకురాలు నాగమ్మ పాత్రకు ప్రాణం పోయడంతో పాటు బ్రహ్మ నాయుడు (మొదటి చిత్రంలో గోవిందురాజుల సుబ్బారావు, రెండో చిత్రంలో ఎన్టీరామారావు) తో ఢీ అంటే ఢీ అన్నట్టు నటించి సత్తా చాటుకున్నారు. పాత్ర స్వభావాన్ని బట్టి అనేక సన్నివేశాల్లో వారిదే పైచేయిగా వుంటుంది కూడా.

అంజలీ దేవీ అంతే. భర్త ఆదినారాయణరావుతో చిత్ర నిర్మాణంలో సంధానకర్తగా వున్నారు. అక్కినేనితో 'సువర్ణసుందరి' వంటి సూపర్ హిట్ చిత్రం తీశారు. అయితే స్వతహాగా ఆమె సాత్విక ప్రధానమైన పాత్రలలో ఎక్కువ ఆదరణ పొందారు. తర్వాత జి.వరలక్ష్మి. కమ్యూనిస్టు భావాలతో ప్రజానాట్యమండలి నేపథ్యం నుంచి వచ్చిన జి.వరలక్ష్మి గంభీరమైన విగ్రహం, కమ్మటి కంఠంతో అగ్రనటులతో దీటుగా నటించారు. 'పెళ్లిచేసి చూడు'లో ఆమె నాయిక అయితే సావిత్రిది సహాయ పాత్రే. జి.వరలక్ష్మి విగ్రహాన్ని బట్టి 'దొంగల్లో దొర' చిత్రంలో అక్కినేనినే శాసించే దొంగల నాయకురాలిగా అద్భుతంగా నటించి చూపారు. 'రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్' ఆమె నటించిన ఆఖరి గొప్ప చిత్రం. మామ్మగా నటించినా ఆమె ద్వారానే ఆ చిత్ర సందేశం అందుతుంది.

అయితే తెలుగు సినిమాలలో నాయిక భావనకు ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రియతమ తార మాత్రం మహానటి సావిత్రి. వేషాల కోసం ఎన్నో అగచాట్లు పడి తారాపథానికి చేరిన సావిత్రికి మొదట్లో బాగా పేరు తెచ్చినవన్నీ నాయిక ప్రధానమైన పాత్రలే. 'అర్ధాంగి'లో అమాయకుడైన భర్తను దారికి తెచ్చుకునే నాయికగా వేసిన పాత్ర సావిత్రికి చాలా పేరు తెచ్చింది. మానసికంగా దుర్బలుడైన దేవదాసును ప్రేమించి భంగపడి కూడా జీవితాంతం మానవతా పూరితంగా నిలిచిన పార్వతి పాత్రకు ఆమె ప్రాణం పోసింది. 'దొంగరాముడు'లో గడుసైన అమ్మాయిగానూ, 'మాయాబజార్'లో మారు వేషం కట్టిన ఘటోత్కజుడి తరహాలోనూ సావిత్రి గొప్పగా నటించింది. చాలా చిత్రాల్లో ఆమె కర్తవ్య విమూఢుడైన హీరోను కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది. దుర్మార్గాలనూ ఎదిరిస్తుంది.

అయితే ప్రధానంగా త్యాగం, అనుబంధాలతో కూడిన గృహిణిగానే సావిత్రి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. అక్కినేనితో పాటు ఆమె శోక పాత్రలలో జీవించడం ఇందుకు ప్రధాన కారణం.

సావిత్రికి ఇంచుమించు సమకాలికురాలు జమున. కొంత కొంటెతనం, చిలిపితనం, గ్లామర్ ప్రధానమైన పాత్రలలో నటిస్తూ వచ్చింది. 'గుండమ్మ కథ, మిస్సమ్మ' వంటి చిత్రాల్లో వీరిద్దరూ ఇద్దరు అగ్రనటుల సరసన నటించడం చూస్తాం. 'మూగమనుసులు' వంటి చిత్రాల్లో సావిత్రికి సమాంతరంగా జమున పాత్ర నడుస్తుంది. జమున ప్రత్యేకత ఏమంటే ఆమె తెర వెలుపల కూడా అగ్రనటుల ఆధిపత్యాన్ని సవాలు చేసింది. ఇది మరే హీరోయిన్ చేయని సాహసం. ఈ కారణంగా 'గుండమ్మ కథ'కు ముందు కొన్నేళ్లపాటు ఆమెను వారిద్దరూ దూరం పెట్టారు. అయితే ఇతర ద్వితీయ శ్రేణి హీరోల పక్కన నటిస్తూ ఆమె తన స్థానం కాపాడుకున్నారు. తర్వాత వారే మనసు మార్చుకుని ఆమెతో నటించారు. తర్వాత కూడా జమున జగ్గయ్య, హరనాథ్ వంటి వారితో కలసి నటించి అనేక విజయాలు అందించారు. తన తర్వాతి తరం వారైన శోభన్‌బాబుతో సహ నటించి మెప్పించారు. 'కలెక్టర్ జానకి, పండంటి కాపురం' వంటి చిత్రాల్లో పరిణితి చెందిన పాత్రలతో కథకు కేంద్ర బిందువయ్యారు. ఎన్టీఆర్‌తో ఆమె నటించిన 'మంగమ్మ శపథం, శ్రీ కృష్ణతులాభారం' వంటివి కూడా ప్రాధాన్యత గల పాత్రలే. తెలుగు నాయికలలో జమునది ఒక ప్రత్యేక స్థానం.

తర్వాత కాలంలో ఒక వెలుగు వెలిగి తర్వాత మరెవరూ అలాంటివారు లేరనిపించుకున్న నాయిక వాణిశ్రీ. తను చెలికత్తెగా నటించిన సంస్థల్లోనే తర్వాత వరుసగా నాయిక పాత్రలు వేసి సత్తా చాటుకున్నారు. 'మరపురాని కథ'లో అమాయకురాలైన నాయికగా ఆర్ద్రత కురిపించిన వాణిశ్రీ తర్వాత నాయకులనే దాటిపోయే నాయికగా ఎదిగారు. దశాబ్ద కాలంపాటు ఆమె నవ నవలా నాయికగా నిలిచారు.'దసరా బుల్లోడు, జీవన తరంగాలు, ప్రేమ నగర్, విచిత్ర బంధం, పవిత్ర బంధం, కథానాయకురాలు, జీవన జ్యోతి' చెప్పాలంటే పెద్ద చేంతాండంత జాబితా. అన్ని రకాల పాత్రలు ధరించడమే కాదు, వాణిశ్రీ గాజులు, చీరలు అంటూ పెద్ద వరవడి పెట్టారు. ఆత్మగౌరవంతో ఎదుగుతున్న ఆధునిక తెలుగు మహిళకు ప్రతిరూపమనిపించుకున్నారు. సావిత్రిని మించిన వైవిధ్యం కనపరిచి తనకు తనే సకాలంలో తప్పుకున్నారు.

విలక్షణ నటి శారద కూడా చాలా కాలం కామెడీ పాత్రలలో సహాయ పాత్రలలో నటించినా 'మనుషులు మారాలి'తో విషాద విశ్వరూపం చూపించారు. ఆకర్షణ కన్నా అభినయానికే పెద్దపీట వేస్తూ జాతీయ స్థాయిలో ఊర్వశి పురస్కారం ఒకటికి రెండు సార్లు తెచ్చుకున్నారు. శోభన్ బాబుతో కలసి అనేక సామాజిక చిత్రాల్లో నటించి మెప్పు పొందిన శారద మహిళా చిత్రాలకు మారు పేరయ్యారు. క్రాంతికుమార్ విశ్వనాథ్‌ల 'శారద' ఆమెను ఎక్కడికో తీసుకెళ్లింది. ఒక విధంగా విషాదం ఎక్కువగా చూపిస్తారనే పేరున్నా అది సావిత్రి తరహాకు భిన్నమైంది. విశేషం ఏమంటే ఎనభైలలో క్యారెక్టర్ వేషాలు మొదలెట్టాక కూడా శారద సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ స్త్రీల హక్కుల కోసం పోరాడే కార్యకర్తగా న్యాయవాదిగా అనేక చిత్రాల్లో నటించి తనూ ఆ పాత్రలు ఒకటేనన్నంత భావన కలిగించారు.

తర్వాత తరంలో జయసుధ, జయప్రద, శ్రీదేవి..వీరందరూ కూడా ఒకే తరహా కాదు. జయసుధతో క్రాంతికుమార్ 'జ్యోతి' తీసినప్పుడే ఒక ప్రత్యేకత కలిగించారు. జయప్రద 'భూమికోసం'తో పరిచయమై తర్వాత వరుసగా అలాంటి చిత్రాల్లోనే కనిపించారు. ఆ పైన బాలచందర్ 'అంతులేని కథ' కూడా పూర్తిగా నాయిక ప్రధానమైందే. విశ్వనాథ్ 'మాంగల్యానికి మరో ముడి' కూడా ఆ దశలోనే తీశారు. తర్వాత మాత్రం జయప్రద ఎక్కువగా గ్లామర్ పాత్రలలో కనిపించారు. ఇక శ్రీదేవి అటు అందం ఇటు అభినయం రెండు కోణాలలోనూ అనితర సాధ్యమైన విజయం సాధించారు. తనకన్నా రెండు మూడు తరాల ముందు వారైన ఎన్టీఆర్ ఏఎన్నార్లతోనే కాక వారి పిల్లలతోకూడా నటించి పురుషాహంకారాన్ని పటాపంచలు చేశారు. సావిత్రి తరంలోని 'దేవదాసు' కొత్త రూపమైన 'ప్రేమాభిషేకం'లో శ్రీదేవి, జయసుధ నటిస్తే, మరో విధమైన 'మేఘ సందేశం'లో జయసుధ, జయప్రదలు నటించడం ఒక విశేషం.

తర్వాత సుహాసిని, విజయశాంతి తమ తమ శైలిలో మహిళా చైతన్య పాత్రలు వేశారు. క్రాంతికుమార్ 'స్వాతి, స్రవంతి' చిత్రాలతో సుహాసినిని శారదకు వారసురాలిగా సుస్థిరపర్చారు.విజయశాంతి మరో కోవలో 'ప్రతిఘటన, కర్తవ్యం, రాములమ్మ' చిత్రాల ద్వారా లేడీ అమితాబ్ అని పిలిపించుకోవడం మొదలెట్టారు. చెప్పాలంటే తర్వాత సౌందర్య పైన చెప్పుకున్న నాయికలందరి లక్షణాలతో పాటు తనదైన ప్రత్యేకతతో శక్తివంతమైన నాయికగా నిలబడింది.

నటీమణుల పరంగా చెప్పుకున్న ఈ విషయాలనే చిత్రాలతో సహా పరిశీలించితే మరిన్ని విశేషాలు కనిపిస్తాయి. అయితే సౌందర్య తర్వాత కాలంలో మాత్రం నాయికల స్థానం మరీ బలహీన పడిపోయిందనే చెప్పాలి. త్రిష, ఆర్తి అగర్వాల్, చార్మి, ఇలా ఎవరైనా సరే కేవలం అందచందాల ప్రదర్శనకు తప్ప అభినయానికి అంతకు మించి పాత్రకు ప్రాధాన్యత లేకపోవడం ఎంతైనా విచారం కలిగిస్తుంది. గత చిత్రాల్లో క్లబ్ డాన్సర్లకన్నా కనాకష్టమైన వేషాలలో నాయికలు కనిపించడం బాధాకరమైనా ఈ పరిణామం ఒక్కసారిగా రాలేదు. నాయకలను కేవలం శృంగారపు బొమ్మలుగా చూపే ఈ ధోరణి పోయి మళ్లీ ఇది వరకటి వలె రక్తమాంసాలు శక్తి సామర్థ్యాలు గల పాత్రలు రూపొందాలని ఆశిద్దాం.

★

కొత్త పుస్తకాలు

ఇండియా 2020

నూతన సహస్రాబ్ది దిశగా

ఒకప్పుడు వీధుల్లో రత్నాలు, వజ్ర వైఢూర్యాలు కుప్పగా పోసి వ్యాపారం సాగించిన 'సోనే కీ చిడియా' మన భారత దేశం అని చరిత్రలో ఉంది. ప్రస్తుతం చరిత్ర అందరికీ తెలిసిందే.

2020 కల్లా ప్రపంచంలోని ఆర్థికంగా అత్యంత శక్తివంతమైన మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా మన భారత దేశం ఎదగడానికి, మన వ్యవస్థలోని బలాబలాలూ, లోటుపాట్ల గురించి కూలంకషంగా చర్చించిన వృత్తాంతం 'ఇండియా2020'. జంట రచయితల సంయుక్త కృతి ఇది.



రచయితలు మామూలు మనుష్యులు కారు. 'అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్' యావత్ భారత దేశీయులు అభిమానించిన, గర్వించిన మన మాజీ రాష్ట్రపతి, ప్రపంచంలోని మేటి శాస్త్రవేత్తల్లో ఒకరు. భారత దేశపు తొలి ఉపగ్రహ నౌక పి.ఎస్.ఎల్.వి.3, వ్యూహాత్మక క్షిపణులను రూపొందించిన సాంకేతిక మేధావి. 30 విశ్వవిద్యాలయాలనుండి గౌరవ డాక్టరేట్లు పొందిన సాధికారత గల మహామనీషి. దేశ వ్యాప్తంగా లక్షమంది ఉన్నత పాఠశాల విద్యార్థులను కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్న శాస్త్రవేత్త.

మరో రచయిత 'యజ్ఞస్వామి సుందరరాజన్' భారత పరిశ్రమల సమాఖ్యకు సాంకేతిక వ్యవహారాల సీనియర్ సలహాదారు.. అంతరిక్ష పరిశోధనా శాఖ రూపకల్పి.

'భారత్ అభివృద్ధి చెందిన దేశం కాగలదా?' - ' భారత్ మౌలిక సామర్థ్యం' - 'కీలక పరిశ్రమలు' - 'ఆరోగ్య సౌకర్యాలు' - మన లక్ష్యాన్ని సుసాధ్యం చేసే మౌలిక వనరులు' - 'కలను సాకారం చేసుకోవడం' లాంటి సాంకేతిక విషయాన్ని కూలంకషంగా విశ్లేషిస్తూ పన్నెండు అధ్యాయాలూ, 294 పేజీల 'నూతన సహస్రాబ్ది దిశగా' సాగిన ముచ్చట్లున్నాయి. 'ఇండియా 2020' లో.

విశ్లేషణ పార్శ్వాలు అనేకం.

ప్రజలు - ఆర్థిక వ్యవస్థ - వ్యూహాత్మక బలం - మెరుగుపరచుకునే సామర్థ్యం రచన దాదాపుగా 'సాంకేతిక దృష్టి'తో సాగుతుంది.

ప్రపంచంతో పాటు మన దేశం కూడా అభివృద్ధి మార్గంలో ప్రయాణం సాగిస్తున్నది. స్పీడు ఎంత?' అన్నది సగటు మనిషికి అర్థం కాక పోవచ్చు. ఇప్పటికే వంద కోట్ల సంఖ్యను దాటేసిన మన జనసంఖ్యలో 'జి.డి.పి' (ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి)' - సంఘటిత రంగం' - సెన్సెక్స్' -జిఎటిటి (జనరల్ అగ్రిమెంట్ ట్రేడ్ అండ్ టారిఫ్స్) - 'టెక్నాలజీ విజన్' -లాంటి మాటలు ఎందరికి క్షుణ్ణంగా అర్థమయ్యాయనీ?

స్వాతంత్ర్యం రెక్కలు విదిల్చి నింగిలో పయనమై ఆరు దశాబ్దాలు అవుతున్నా సగటు మనిషి ప్రాథమిక ప్రశ్న 'రోటీ -కపడా - మకాన్' అన్నదే కదా!

కొన్ని వేల సంవత్సరాల క్రితం మానవుడు చక్రం కనుగొన్నాడు. ఆయుధాలు తయారు చేసుకుని 'వేటాడటం' లో తర్ఫీదు పొందాడు.నేడు ఇంటింటా 'ఇంటర్నెట్' చేరి 'మానసిక వేట'ను ప్రారంభించింది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి (జి.డి.పి) 1995లో 25854.08 బిలియన్ల డాలర్లు.. 2010 కల్లా 39311.60 బిలియన్ల డాలర్లు దాటుతుంది. 2020 నాటికి ప్రపంచం ఎలా ఉంటుందో - భారతదేశం నొసటి రాత ఎంతగా వెలిగిపోతుందో సగటు మనిషికి అర్థం కాకపోవచ్చు.

మేధస్సు నిండిన బుద్ధిజీవులకు ఈ పుస్తకంలోని సహేతుక విశ్లేషణలు అర్థం కావచ్చేమో కానీ, సగటు మనిషికి 'అసంపూర్ణ స్వప్నాల్లా' - క్లిష్టమైన వాక్యాల్లా - అర్థం కాకపోవచ్చు...! ప్రయత్నించి అర్థం చుసుకుంటే మంచిదే!

- జె.పి. వైద్య

రచన :ఎ.పి.జె. అబ్దుల్ కలాం - వైయస్ రాజన్.
అనువాదం : నాగసూరి వేణుగోపాల్, సరోజాప్రసాద్
(డా॥ గోపరాజు నారాయణరావు)
వెల: 200/- ,
పేజీలు : 294
ప్రతులకు : అశోక్ నగర్ బుక్ సెంటర్ - విశాఖపట్నం.
అక్షర - హైదరాబాద్.



పుడమితల్లికి సంకెళ్లు
(కవితా సంపుటి)
-పొత్తూరి సుబ్బారావు
వెల: 50/-,
పేజీలు : 89,
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్, అబిడ్స్, హైదరాబాద్. మరియు ప్రజాశక్తి బుక్ హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్.



నల్లతుమ్మ
(కవిత్వం)
- డా॥ గూటం స్వామి
వెల: 50/-,
పేజీలు : 96,
ప్రతులకు:
అన్ని పుస్తక కేంద్రాలు.



పొడవు × పొట్టి

ఏదైనా సహజంగా వుందనుకోండి! ఎవ్వరూ పట్టించుకోరు!! అదే ఏ కొంచెం ప్రత్యేకంగా అనిపించినా ఎగబడి చూస్తారు. చర్చిస్తారు. గుర్తుంచుకుంటారు. వీలైతే భద్రపరుచుకుంటారు. కుదిరితే సొంతం చేసుకుంటారు. ఇక్కడ కనిపించే మనుషులుగానీ... జంతువులుగానీ... పువ్వులుగానీ.... ఏవైనా అంతే. ప్రపంచంలోకెల్లా పొడవాటివి కొన్నయితే...అతి పొట్టివి కొన్ని, ఆ కోవకు చెందిన పొడవాటి గుర్రం...పొట్టి గుర్రం ఒన్ ఫైన్ మార్నింగ్ కలుసుకున్నాయనుకోండి. ఎలా వుంటుంది? కన్నుల పండుగేకదా. అలాగే అతి పొట్టి మనిషి పింగ్‌పాంగ్ అతిపొడవాటి వ్యక్తి బూటు పట్టుకుని పోజిచ్చాడనుకోండి? ప్రపంచంలోకెల్లా అతిపొడవాటి కాళ్ల సుందరి అతి పొట్టి వ్యక్తితో కరచాలనం చేసిందనుకోండి! అతి పొడవాటి కుక్క అతి పొట్టి కుక్కకు హాయ్ చెప్పిందనుకోండి. అబ్బో తమాషానే తమాషా. ఆ సమయంలో గాని ఆ పరిసరాల్లో గానీ ఫొటోగ్రాఫర్లుంటే ఫ్లాష్‌ల మీద ఫ్లాష్‌లు. బోలెడన్ని దృశ్యాలను కెమెరాల్లో బంధించేయరూ! ఇప్పుడు మీ ముందున్నది అటువంటి అరుదైన చిత్రరాజాలే!

కథా నిలయం
శ్రీకాకుళం



పగటి కల

- పుప్పాల కృష్ణమూర్తి

ఎడారి పిల్లి కొండ మీదకెక్కి, ఎర్రటి ఎలుకల్ని పట్టుకుని, పూటగా తిన్నది. అది తన చెవుల్ని నిక్కించి... కోల కళ్లతో శత్రువులెవరైనా కనిపిస్తున్నారేమోనని చుట్టూ చూసింది. ముఖ్యంగా తనను వెంటబడి తరిమే తోడేలు కనిపిస్తుందేమోనని చూసింది. దరిదాపుల్లో ఏనుగులు తప్ప, క్రూర జంతువులేవీ కనిపించలేదు.

మెల్లగా భుక్తాయాసంతో నడుచుకుంటూ వెళ్లి చెట్టు ఎక్కింది. ఓ కొమ్మ చూసుకుని మత్తుగా పడుకుంది. రాత్రంతా గాఢ నిద్ర పోయింది. తెల్లవారాక దానికి మెలకువ వచ్చింది. కాని కడుపు మందంగా ఉండడంతో చెట్టు దిగబుద్ధి కాలేదు. మళ్లీ పడుకుంది. నిద్ర పట్టలేదు. మగతగా అలాగే పడుకుంది. తోడేలు జ్ఞాపకం వచ్చింది. "దానికి ఎలాగైనా బుద్ధి చెప్పాలి. ఆ సింహం లాగానో, ఆ ఏనుగు లాగానో నాకూ బలమైన శరీరం ఉంటే, దాన్ని చంపి పడేసి ఉండేదాన్ని, నేను కనడబడితే చాలు. వెంటబడి చంపడానికి పరిగెత్తుకొస్తోంది. ఏం చేయాలబ్బా" అని ఆలోచించసాగింది. అలా నిద్రలోకి జారుకుంది.

దానికి కలలో తల్లి కనిపించింది. "ఎందుకమ్మా నన్నింత చిన్నగా పుట్టించావు? చిరుత పులిలా పెద్దగా పుట్టించి ఉంటే ఈ నక్కలకు, తోడేళ్లకు, భయపడేదాన్ని కాదు గదా. వాటిని చీల్చి చెండాడేదాన్ని. నా జోలికి రాకుండా సింహానికి కూడా ఖబడ్దార్ చెప్పేదాన్ని కదా" అంది.

అందుకు తల్లి "నాయనా! నువ్వేం చింత పడకు. మనది కూడా చిరుతపులి వంశమే. చాలా ఏళ్ల కిందటి మాట. మీ తాతయ్యకు ఇద్దరు భార్యలుండేవారు. పెద్ద భార్యకు ఒక చిరుత పుట్టింది. చిన్న భార్యకు ఒక చిరుత పుట్టింది. అవి బల పరాక్రమాల్లో ఒకదానికొకటి తీసిపోకుండా పెరగసాగాయి. ఒకనాడు అడవిలో వేటాడుతూ, ఒక లేడిని చంపాయి. నేను చంపానంటే, నేను చంపానని వాదులాడుకున్నాయి. తర్వాత ఘర్షణ పడి ఒకదాన్నొకటి చంపుకునేదాకా వెళ్లాయి. వాటి భీకర పోట్లాటకు జంతువులన్నీ హడలిపోయాయి. ఓ పావురం వెళ్లి వాళ్ల నాన్నకు చెప్పింది. ఆయన ఆగమేఘాల మీద భార్యల్ని వెంటబెట్టుకుని వాటి వద్దకు వచ్చాడు. ఇద్దర్నీ చెరో దెబ్బ వేసి, పోట్లాట ఆపేశాడు. పెద్ద భార్య తన కొడుక్కయిన గాయాల్ని చూసి 'అన్నయ్యనే గౌరవం లేకుండా నా బిడ్డను ఇంతగా గాయపరుస్తాడా?వాళ్లను శిక్షించందే నేను మీతో కాపురం చేయను' అంటూ రోదిస్తూ వెళ్లసాగింది. ఆయన ఆగ్రహంతో 'ఇప్పట్నుంచి నువ్వు నీ సంతానం పిల్లిగా మారిపోవుగాక' అని చిన్న భార్యకు శాపం పెట్టాడు. ఆమె ఏడుస్తూ భర్త పాదాలు పట్టుకుని "ఇద్దరూ తప్పు చేశారు. ఒక్కణ్ణి శిక్షించడం న్యాయమా? వాడు కూడా నీ బిడ్డే కదా" అని ప్రాధేయపడింది. దానికి చిరుతపులి 'నా శాపానికి తిరుగులేదు. అంతగా వేడుకుంటున్నావు కాబట్టి నా జాతి గుర్తుగా, శరీరాకృతి అచ్చం చిరుత పులిలాగానే ఉంటుంది.. కాని పరిమాణంలో పిల్లిలా స్వభావంలో పిరికిదానిలా ఉంటుంది' అని వెళ్లి పోయాడు పెద్ద భార్యను వెంటబెట్టుకుని. అప్పటి నుంచి మనం పిల్లుల మాదిరిగా తయారయ్యాం. వాళ్ల సంతానం పులి సంతానంలా వృద్ధి చెంద సాగింది" అంది.

"అయితే అమ్మా, మనం ఇక ఎన్నేళ్లయినా... ఇలాగే ఉండి పోవాల్సిందేనా?" అంది.

"లేదునాయనా? వెయ్యి సంవత్సరాల కాలం వరకు మాత్రమే మనమిలా ఉంటాం. తర్వాత శాపం తీరిపోయి మనం కూడా పులుల మాదిరిగానే మారిపోతాం"

"ఆ గడువు ఎప్పటికల్లా తీరుతుందమ్మా"

"రేపటి పౌర్ణమితో గడువు ముగుస్తుంది. అదే రోజు మన సంతానమంతా పులుల మాదిరిగా మారిపోతారు" అంది.

"కృతజ్ఞతలు తల్లీ!" అని నమస్కారం చేసింది.

పౌర్ణమి రానే వచ్చింది. చంద్రుని కిరణాలు పడిన ఎడారి పిల్లి అద్భుతంగా, చిరుత పులిగా మారిపోయింది. వెంటనే గాండ్రిస్తూ, బరువుగా అడుగులు వేస్తూ, ముందుకు కదిలింది. శత్రువు కంటబడ్డాడు. అంతే తోడేలు మీదకు అమాంతం లంఘించి, మీదకు దూకింది దాని మెడ కొరికి రక్తం తాగాలని. ఆ విసురుకు పిల్లి దబ్బుమని నేలమీద పడిపోయింది కొమ్మ మీంచి. దాని నిద్ర మత్తు వదిలిపోయింది. దూరం నుంచి తోడేలు వస్తూ కనిపించింది. 'చచ్చాన్రా దేవుడా...' అనుకుంటూ, పరుగందుకుంది.

◆◆◆